అమర వీరులకు నివాళి





పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని బీచ్ రోడ్డులో సోమవారం నిర్వహించారు. అమరవీరుల స్థూపం వద్ద సీపీ శంఖబ్రత బాగ్చీ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, తదితరులు నివాళులర్పించి వారి త్యాగాలను స్మరించుకున్నారు. –న్యూస్‌టుడే, పెదవాల్తేరు

ఎంతైనా వీరు మాయల్లో వీరులే..

వైకాపా హయాం.. 'హయగ్రీవ' మాయం!! | తప్పుడు పత్రాలతో ఇష్టారాజ్యంగా లావాదేవీలు | ఈడీ దర్యాప్తులో మాజీ ఎంపీ ఎంవీవీ, జీవీ అక్రమాలు వెలుగులోకి



ఈనాడు–విశాఖపట్నం

వృద్ధులు, అనాథలకు కేటాయించిన భూములపై వైకాపా నేతలు వాలిపోయారు. పక్కా వ్యూహంతో తప్పుడు పత్రాలు, ఫోర్జరీ సంతకాలతో హయగ్రీవ ప్రాజెక్టును గుప్పిట్లోకి తీసుకున్నారు. వృద్ధుల భూములను ప్లాట్లుగా మార్చి పప్పుబెల్లాల్లా అమ్మేసి జేబులు నింపేసుకున్నారు. ఈ వ్యవహారంలో 'హయగ్రీవ' ప్రాజెక్టుకు చెందిన జగదీశ్వరుడు ఇటీవల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఈనెల 17న ఈ కేసులో నిందితులుగా ఉన్న మాజీ ఎంపీ ఎంవీవీ తదితరులకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. అయితే మనీల్యాండ రింగ్ కింద ఈడీ దర్యాప్తు చేపట్టగా... సోదాల్లో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.

బినామీ పట్టాదారులెవరు?

ఎంవీవీ, జీవీల ఇళ్లు, కార్యాలయాల్లో శనివారం, ఆదివారం ఈడీ సోదాలు చేసినప్పుడు బినామీ పట్టాదారు పాసుపుస్తకాల రూపంలో నేర నిరూపణకు సంబంధించిన దస్తావేజులు ఎన్నో గుర్తించారు. ఎవరి పేరుతో ఈ బినామీ పట్టాదారు పాసుపుస్తకాలున్నాయనేది ఇప్పుడు సర్వత్రా ఆసక్తిగా మారింది. మోస పూరితంగా హయగ్రీవ ప్రాజెక్టును లాక్కొన్నారనడానికి కావాల్సిన ఆధారాలకు సంబంధించిన పత్రాలు సైతం ఈ దాడుల్లో దొరికినట్లు సమాచారం.

డిజిటల్ పరికరాలపై సర్వత్రా చర్చ

ఈడీ సోదాల్లో దొరికిన డిజిటల్ పరికరాలు కేవలం కంప్యూటర్, హార్డ్ డిస్కు లేనా? నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసేందుకు ఉపయోగించినవా? అనేది సర్వత్రా ఆసక్తిగా మారింది. ఇదే విషయం సామాజిక మాధ్యమాల్లోనూ వైరల్ అవుతోంది. కుటుంబ సభ్యుల పేరిట ఉన్న వందల సంఖ్యలోని స్థిరాస్తి విక్రయ పత్రాలు, రూ.కోట్ల నగదు లావాదేవీలపైనా ఈడీ విచారణ కొనసాగిస్తోంది. బలవంతంగా తమ భూములు లాక్కొన్నారంటూ జగదీశ్వరుడు పెట్టిన కేసు నేపథ్యంలో ఎంవీవీపై ఈడీ దాడులు చేయగా... వైకాపా నేతల్లో గుబులు పెరిగింది. స్థిరాస్తి వ్యవహారాల్లో, ప్రాజెక్టులు లాక్కోవడంలో కీలకంగా వ్యవహరించిన, సహకరించిన నేతలు హడలిపోతున్నారు.



ఎప్పుడూ కప్పిపుచ్చుకునే యత్నమే

వైకాపా హయాంలో నేతలు గుప్పిట్లోకి వెళ్లిన పెద్ద ప్రాజెక్టుల్లో 'హయగ్రీవ' ఒకటి. ఈ ప్రాజెక్టు చేతులు మారడంలో జరిగిన మోసాలు, అనుమతుల కోసం అధికార దుర్వినియోగం, అక్రమ మైనింగ్ వంటి అంశాలపై మీడియాలో వార్తలు వచ్చిన ప్రతిసారి నాటి వైకాపా ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కప్పిపుచ్చుకునే ప్రయత్నాలు చేశారు. తన స్నేహితుడు, ఆడిటర్ జీవీ కోసం హయగ్రీవ ప్రాజెక్టులో బిల్డర్‌గా ఉన్నానని, జగదీశ్వరుడికి తనకు ఎలాంటి సంబంధం లేదంటూ ఇటీవల విలేకరుల సమావేశంలోనూ చెప్పుకొచ్చారు. ఉత్తరాంధ్రలో భూములపై కన్నేసిన వైకాపాలోని ఓ కీలక నేత కన్ను పడకూడదంటే హయగ్రీవలో గద్దె బ్రహ్మాజీని భాగస్వామ్యం చేసుకోవాలంటూ ఆడిటర్ జీవీ.. జగదీశ్వరుడిని భయపెట్టి పావులు కదిపినట్లు నాడు ఆరోపణలొచ్చాయి. ఈ నేపథ్యంలోనే గద్దె బ్రహ్మాజీకి 75% వాటా ఇస్తూ హయగ్రీవలో మేనేజింగ్ పార్టనర్‌గా జగదీశ్వరుడు చేర్చుకున్నారు. ఆ వెంటనే బ్రహ్మాజీ నుంచి భూమి జీవీకి జీపీఏ అయింది. ఇంకేముంది. తరువాత స్థలాల అమ్మకాలు జరిగిపోయాయి. ఈ క్రమంలో 'హయగ్రీవ'కు చెందిన జగదీశ్వరుడు, రాధారాణిల సంతకాలు ఫోర్జరీ అయినట్లు ఈడీ తాజాగా నిర్ధారించింది.

తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో సేవల లోపం!
రైల్వేకు జరిమానా

ఈనాడు, విశాఖపట్నం: తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో సేవల లోపంపై విశాఖ వినియోగదారుల కమిషన్ రైల్వేకు జరిమానా విధించింది. విశాఖకు చెందిన వి.సత్యనారాయణమూర్తి గత ఏడాది జూన్‌లో తిరుపతి నుంచి విశాఖకు వచ్చేందుకు తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలెక్కారు. థర్డ్ ఏసీలో రైలు వచ్చే పది నిమిషాల ముందు బెర్తులు మార్చడంతో గందరగోళానికి గురయ్యారు. మరుగుదొడ్లలో నీళ్లు లేక చాలా మంది ఇబ్బంది పడ్డారు. సమస్యలను టికెట్ తనిఖీ అధికారి (టీటీ) దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కరించలేదు. దీంతో సత్యనారాయణ మూర్తి విశాఖ వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. కమిషన్ అధ్యక్షులు జి.తనూజ, ఇతర సభ్యులు రహీమున్నిషా బేగం, కృష్ణమూర్తి విచారణ జరిపి రైల్వేకు రూ.25 వేలు అపరాధ రుసుం, కోర్టు ఖర్చులకు రూ.5 వేలు ప్రయాణికుడికి చెల్లించాలని ఆదేశించారు.

నగరంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



రుషికొండ భవన సముదాయ పరిసరాలను తన చరవాణితో ఫొటో తీస్తున్న పవన్‌కల్యాణ్

ఎన్ఏడీకూడలి(కాకానినగర్), న్యూస్‌టుడే: జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు సోమవారం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఎంపీ ఎం.శ్రీభరత్, జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, కూటమి నాయకులు భారీగా తరలివచ్చారు. అనంతరం రోడ్డు మార్గంలో విజయనగరం జిల్లా గుర్ల మండలం వెళ్లారు. అక్కడ పర్యటన ముగించుకుని తిరిగి వస్తూ...సాయంత్రం రుషికొండకు వెళ్లారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో జగన్ నిర్మించిన భవంతులను పరిశీలించారు. అక్కడ పని చేస్తున్న కూలీలతో మాట్లాడి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. 4.40 గంటలకు విమానాశ్రయానికి చేరుకుని ప్రత్యేక విమానంలో గన్నవరం బయలుదేరారు. ఈ సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులు, కూటమి నాయకులు ఆయనకు ఆత్మీయ వీడ్కోలు పలికారు.



విమానాశ్రయంలో అభివాదం చేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



రుషికొండపై కూలీలతో మాట్లాడుతూ...

రోజులు మారుతున్నాయ్ పునాదులు నవ్వుతున్నాయ్

– ఈనాడు, విశాఖపట్నం





విశాఖపట్నం రైల్వే స్టేషన్ అభివృద్ధి కలేనా? అనే సందేహాలు నగర వాసుల్లో రోజురోజుకు పెరిగిపోతున్నాయి. దాదాపు రెండేళ్ల క్రితం స్వయంగా ప్రధాన మంత్రి చేతుల మీదుగా సుమారు రూ. 456 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన జరిగింది. ఏడాదిన్నర క్రితం జ్ఞానాపురం వైపు పనులు ఆరంభించారు. ఆ తరువాత గోతులు తవ్వి...కొన్ని పనులు చేసి **ఇదిగో ఇలాంటి స్థితిలో** నిలిపేశారు. ఇందుకు ఎన్నో సాంకేతిక, ఆర్థికపరమైన కారణాలను అధికారులు చెబుతున్నారు. అవన్నీ ఎలా ఉన్నా...విశాఖ రైల్వే స్టేషన్ అభివృద్ధి మాత్రం అడుగు కూడా ముందుకు సాగలేదన్నది సత్యం. దేశంలోనే కీలక నగరంగా ఎదుగుతున్న విశాఖపై ప్రజాప్రతినిధులు దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎవరూ తగ్గలే.. అక్రమార్కులకు పగ్గాలే!!

సింహాచలం దేవస్థానంలో వైకాపా హయాంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన కొందరు అధికారులు కూటమి హయాంలోనూ చక్రం తిప్పుతున్నారు. లీజులు, ఆలయ భూముల్లో అవకతవకలకు పాల్పడిన పలువురికి కీలక బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు వస్తున్నాయి. అంతర్గత బదిలీలంటున్నా... పూర్తిస్థాయిలో ఇవి లేవనే ఆరోపణ లొస్తున్నాయి.

"వైకాపా పాలనలో పెత్తనం సాగించారు
మళ్లీ వారికే 'సింహాచలం'లో కీలక బాధ్యతలు

ఈనాడు, విశాఖపట్నం



కొందరు ప్రజాప్రతినిధుల అండ, పైరవీలతో మళ్లీ తెరపైకి వచ్చినట్లు తెలుస్తోంది. ఈవో త్రినాథరావు వీటన్నింటి మీద లోతుగా పరిశీలించి చక్కదిద్దకపోతే 'భూముల స్వాహా' కార్యక్రమాలు నిరాటంకంగా సాగే పరిస్థితి తలెత్తుతుందని పలువురు పేర్కొంటున్నారు.

» వివాదాస్పద ఓ ఏఈవోకు దేవస్థానంలో కీలకమైన అకౌంట్స్, కోర్టు కేసు వ్యవహారాలు తిరిగి కేటాయించడంపై విమర్శలు వస్తున్నాయి. గత ప్రభుత్వంలో శారదాపీఠం ప్రతినిధులకు శిష్యుడిలా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. దేవస్థానానికి శారదాపీఠాధిపతి వస్తే ఆ ఏఈవోనే ప్రొటోకాల్ చూసేవారు. సింహాచలానికి వచ్చే వీవీఐపీలను శారదాపీఠానికి తీసుకువెళ్లేవారు. అలాగే...దేవస్థానానికి చెందిన భూములు, కోర్టు వ్యవహారాలను ప్రైవేటుగా చర్చించి అక్రమాలకు తావిచ్చారన్న ఆరోపణలు అప్పట్లో వచ్చాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక కొద్ది రోజుల కిందట స్వచ్ఛంద పదవీవిరమణకు దరఖాస్తు చేశారు. ఈ దస్త్రాన్ని అమరావతికి పంపించారు. ప్రస్తుతం దీనిపై ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసిన అధికారికి భూముల కోర్టు కేసులు, ఇతర వ్యవహారాలు అప్పగించడంపై అనుమానాలు రేగుతున్నాయి. గతంలో ఎన్నో భూవివాదాల్లో దేవస్థానం తరఫున కోర్టుకు సమాధానం ఇవ్వాల్సి ఉన్నా ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చేశారన్న విమర్శలున్నాయి.

» ఓ ఏఈవో ప్రధాన ఆలయంతో పాటు ఉప ఆలయాల పర్యవేక్షణను గతంలో చూసేవారు. ఆ క్రమంలో సింహాచలం దేవస్థానం భూముల్లో అనేక అక్రమ నిర్మాణాలకు పాల్పడ్డారన్న ఆరోపణలొచ్చాయి. వీటిపై విచారణ కూడా సాగింది. ఆ నివేదిక అధికారులకూ చేరింది. అయినా సరే మళ్లీ దేవస్థానం భూముల పరిరక్షణ బాధ్యతలు ఆయనకే అప్పగించడంపై విమర్శలు వస్తున్నాయి. బదిలీల్లో ఆలయాల నిర్వహణతో పాటు అదనంగా పలు సర్వే నంబర్లలోని ఎంతో విలువైన భూముల పరిరక్షణ అప్పగించారు. ప్రధాన ఆలయం చూసే వారికి భూముల పరిరక్షణ ఇవ్వకూడదు. అయినా ఇక్కడ అప్పగించేశారు.

» గతంలో 'ఎస్టాబ్లిష్‌మెంట్' చూసే ఏఈవోకు ఆగమ పాఠశాల, ఉన్నతపాఠశాల, కొండ కింద ఉప ఆలయాలు, వెంకటాపురం, వేపగుంట, చీమలాపల్లి, పురుషోత్తపురం గ్రామాల్లోని భూముల పరిరక్షణ బాధ్యతలు ఇచ్చారు. ఈయనపై అనేక ఆరోపణలున్నాయని, మళ్లీ భూములు బాధ్యతలివ్వడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల బదిలీ మీద వచ్చిన ఓ ఏఈవోకు గతంలో కేటాయించిన విధులే కొనసాగించారు. ఆరోపణలు ఏమీ లేని మరో ఏఈవోను ప్రాధాన్యం లేని బాధ్యతలకే పరిమితం చేశారనే చర్చ సాగుతోంది.

జిల్లా అభివృద్ధిపై 25న సమీక్ష

వన్‌టౌన్, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఈనెల 25న జిల్లా పర్యటనకు రానున్నారు. ఆరోజు మధ్యాహ్నం కలెక్టరేట్ సమావేశమందిరంలో జిల్లా అభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తారని కలెక్టర్ హరేంధిరప్రసాద్ తెలిపారు. జిల్లాలో చేపట్టిన ప్రాజెక్టులు, అమలవుతున్న సంక్షేమ పథకాలు, పరిపాలనా పరమైన అంశాలపై చర్చిస్తారన్నారు. అదేరోజు ఉదయం ఆనందపురం మండలం సి-కన్వెన్షన్ హాలులో భీమిలి నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష జరుగుతుందని తెలిపారు.

» ఈనెల 24న జడ్పీ సాధారణ సమావేశం జడ్పీ సమావేశమందిరంలో జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అజెండాకు అనుగుణంగా గత సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న చర్యల నివేదికలతో రావాలని అధికారులకు సూచించారు.

ఐటీహిల్స్‌కు ఆర్టీసీ బస్సులు



నూతన బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా, ఎంపీ శ్రీభరత్

మధురవాడ, న్యూస్‌టుడే: రుషికొండ ఐటీహిల్స్‌లో వివిధ పరిశ్రమల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు, సిబ్బంది కోసం ఆర్టీసీ కొత్తగా ప్రవేశపెట్టిన నాలుగు బస్సు సర్వీసులను మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్ సోమవారం ప్రారంభించారు. ఇన్ఫోసిస్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో వీరిరువురు తొలుత పూజలు నిర్వహించి పచ్చజెండా ఊపారు. అనంతరం మాట్లాడుతూ ఐటీ పరిశ్రమ అభివృద్ధికి మంత్రి నారా లోకేశ్ చేస్తున్న కృషితో భవిష్యత్తులో ఎన్నో కంపెనీలు రానున్నాయన్నారు. బస్సులు పాత గాజువాక, కూర్మన్నపాలెం, పెందుర్తి, విజయనగరం నుంచి ప్రతి రోజు ఉదయం 8 గంటలకు బయలు దేరి ఐటీ హిల్స్‌కు చేరుకుంటాయని ఆర్ఎం బి.అప్పలనాయుడు తెలిపారు. వీటితో పాటు గాజువాక, ద్వారకా బస్‌స్టేషన్ నుంచి మరో రెండు బస్సులు నడుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇన్ఫోసిస్ కార్యాలయాన్ని గంటా, శ్రీభరత్ పరిశీలించి అక్కడి ఐటీ ఉద్యోగులతో మాట్లాడారు. ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం జి.సత్యనారాయణ, తెదేపా భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, ఏపీ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మేనేజర్ కీర్తన ఆనంద్, తెదేపా నేతలు పాల్గొన్నారు.

విమ్స్‌లో రొమ్ము క్యాన్సర్‌పై ఉచిత అవగాహనా శిబిరం నేడు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: విమ్స్ ఆసుపత్రిలో మంగళవారం రొమ్ము క్యాన్సర్‌పై ఉచిత అవగాహనా శిబిరం నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. అనుభవం కలిగిన మహిళా వైద్యులు రొమ్ము క్యాన్సర్ నిర్ధరణ వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరం అయిన వారికి బెస్ట్ అల్ట్రాసౌండ్, బయాప్సి తదితర వైద్యపరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులందిస్తారన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్న ఈ వైద్య శిబిరాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఐటీఐల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కంచరపాలెం, న్యూస్‌టుడే: ఐటీఐల్లో మిగులు సీట్ల భర్తీకి అయిదో విడత ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు దరఖాస్తులు ఈనెల 26లోగా చేసుకోవాలని ప్రిన్సిపల్ జె.శ్రీకాంత్ తెలిపారు. ఇప్పటికే నాలుగు విడతల్లో కౌన్సెలింగ్ నిర్వహించినపుడు దాదాపు అన్ని సీట్లు ప్రభుత్వ ఐటీఐల్లో భర్తీ అయ్యాయన్నారు. ఈనెల 28న ప్రభుత్వ ఐటీఐలకు, 30న ప్రయివేటు ఐటీఐలకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఎక్కడ దరఖాస్తు చేశారో అక్కడే కౌన్సెలింగ్‌లో పాల్గొనాలని ఆయన తెలిపారు.

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ కోసం ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులను ఆహ్వానిస్తున్నామని ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. ఈనెల 30లోగా www.apprenticeshipindia.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు పంపాలన్నారు. విశాఖ పరిధిలో డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, పెయింటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. నవంబరు 6న అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

మళ్లీ సాగర పరీక్షకు 'ఐఎన్ఎస్ నిస్తార్'

సింధియా, న్యూస్‌టుడే: హిందుస్థాన్ షిప్‌యార్డులో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన 'డైవింగ్ సపోర్ట్ వెసెల్-ఐఎన్ఎస్ నిస్తార్' నౌకకు త్వరలో ఫైనల్ సీట్రయల్ జరగనుంది. భారత నౌకాదళానికి రక్షణ అవసరాల నిమిత్తం జలంగా 'ఐఎన్ఎస్' నిర్మాణ ఆర్డరును రెండేళ్ల కిందటే హిందుస్థాన్ షిప్‌యార్డు దక్కించుకుంది. ఇప్పటికే పలు దఫాలుగా సీట్రయల్ నిర్వహించిన ప్రక్రియలోనే పలు సాంకేతిక పరమైన అంశాల్లో లోపాలు తలెత్తిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఈ డైవింగ్ సపోర్ట్ వెసెల్-నిస్తార్ సుదీర్ఘ సన్నాహక సముద్రయానం ఈ ఏడాది సెప్టెంబరు 27 నుంచి అక్టోబరు 5వ తేదీ వరకు కొనసాగించడం సంస్థ చరిత్రలో ఇదే అత్యంత అధిక కాల వ్యవధితో కూడిన సీట్రయల్‌గా సంస్థ ఉద్యోగ వర్గాలు భావిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఇదే వెసెల్ నవంబరు తొలి వారంలో తుది సీట్రయల్‌కు యాజమాన్యం శ్రీకారం చుట్టనుందని ఉద్యోగ వర్గాలు పేర్కొన్నాయి. ఈ నౌక పూర్తయితే ఇదే సిరీస్‌కు చెందిన మరో డీఎస్‌వీ-ఐఎన్ఎస్ నిపుణ్ నిర్మాణ పనులకు జోరు పెంచనున్నారు.



ఫైనల్ సీట్రయల్‌కు వెళ్లనున్న డీఎస్‌వీ-ఐఎన్ఎస్ నిస్తార్ నౌక

కలెక్టరేట్‌కు అర్జీల వెల్లువ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి అర్జీలు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు 230 అర్జీలు అందజేశారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్, జేసీ మయూర్ అశోక్, డీఆర్వో మోహన్‌కుమార్, ఆర్డీఓ శ్రీలేఖ, జీవీఎంసీ అదనపు కమిషనర్ వర్మ, ఇతర అధికారులు వాటిని స్వీకరించారు. వ్యక్తిగత సమస్యలపై అధికంగా అందాయి. రెవెన్యూ విభాగానికి 84, జీవీఎంసీకి 65, పోలీసుశాఖకు 12, ఇతర శాఖలకు 69 చొప్పున వచ్చాయి. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలకు నాణ్యమైన పరిష్కారాలు చూపాలని ఆదేశించారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, ఇతర అధికారులు

సీపీ కార్యాలయంలో...

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : పోలీసు సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు విశేష స్పందన లభించింది. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. తక్షణమే సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించటంలో అలసత్వం వహించవద్దని ఆదేశించారు. మొత్తం 98 ఫిర్యాదులు అందాయి. ఎ.సి.పి.లు, సి.ఐ.లు వారి వారి కార్యాలయాల్లో ఉంటూ పలువురి నుంచి వినతులు స్వీకరించారు.



బాధితులతో మాట్లాడుతున్న సి.పి. శంఖబ్రత బాగ్చీ

జీవీఎంసీలో...

కార్పొరేషన్, న్యూస్‌టుడే: జీవీఎంసీకి వస్తున్న ప్రజా సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినతుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేకంగా సమయం కేటాయించాలని సూచించారు. ★ బక్కన్నపాలెంలో ముస్లిం శ్మశానవాటిక నిర్మించాలని 2010 నుంచి కోరుతున్నా పట్టించుకోవడంలేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఎంవీపీకాలనీలో ఉన్న తన నివాసం ఇంటి నెంబరు బీచ్‌రోడ్డులోని పాండురంగస్వామి ఆలయం వద్ద ఉన్నట్లు చూపుతోందని, చిరునామా మార్చాలని ఇంటి యజమాని కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మొత్తం 77 వినతులు వచ్చాయి. వాటిలో జోన్-1కు రెండు, జోన్-2కు 8, జోన్-3కు 14, నాలుగో జోన్‌కు 5, ఐదో జోన్‌కు 16, ఆరో జోన్‌కు 5, ఏడో జోన్‌కు ఒకటి, జోన్-8కు 9, జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి 17 చొప్పున వచ్చాయి.



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

అన్నప్రసాద పథకానికి రూ.3లక్షల విరాళాలు

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య అన్నప్రసాద పథకానికి హైదరాబాద్ జూబ్లీహిల్స్ ప్రాంతానికి చెందిన హాస్యా మూవీస్ అధినేతలు సోమవారం విరాళాలు సమర్పించారు. రాజేశ్ దండా రూ.1,00,116, అపర్ణ దండా రూ.1,00,116, హాస్యా మూవీస్ శాన్వీ, హాస్య రూ.1,00,116 మొత్తం రూ.3,00348 విరాళాలుగా సమర్పించారు. విరాళాలను చెక్కుల రూపంలో దేవస్థానం ఈవో వేండ్ర త్రినాధరావుకు అందజేశారు. అధికారులు దాతలకు స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్, ప్రొటోకాల్ పర్యవేక్షకుడు విక్రమ్, ఆలయ పర్యవేక్షకుడు జీవీఎస్‌కే ప్రసాద్, పీఆర్వో నాయుడు పాల్గొన్నారు.



ఈవో త్రినాధరావుకు విరాళం చెక్కులు అందిస్తున్న దాతలు

గోల్డ్ డిపాజిట్ పథకంలో అప్పన్న ఆభరణాలు

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామికి భక్తులు కానుకల రూపంలో సమర్పించిన బంగారు ఆభరణాలు, వస్తువులను దేవస్థానం అధికారులు గోల్డ్ డిపాజిట్ పథకంలో జమ చేశారు. భక్తులు హుండీల్లో సమర్పించిన బంగారు ఆభరణాలు, వస్తువులను అధికారులు ఆలయ భాండాగారంలో భద్రపరిచారు. వాటిని ఈవో వేండ్ర త్రినాధరావు, దేవాదాయశాఖ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సింహగిరిపై తూకం వేశారు. కానుకల రూపంలో లభ్యమైన 4.380 కిలోల బంగారాన్ని నగరంలోని ఎస్‌బీఐ ప్రధాన శాఖలో డిపాజిట్ చేశారు. ఈ మేరకు వాటిని బ్యాంకు ప్రతినిధి నరసింహరాజుకు అందజేశారు. ఇప్పటి వరకు దేవస్థానం సుమారు 50కిలోల బంగారాన్ని డిపాజిట్ల రూపంలో జమ చేసింది. వీటి నుంచి ఏటా సుమారు రూ.40లక్షల వరకు వడ్డీ సమకూరుతుంది. ఈ కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ఉప కార్యనిర్వహణాధికారి రాధ, దేవాదాయశాఖ ఆర్‌జేసీ (రాజమహేంద్రవరం) సుబ్బారావు, జువెలరీ వెరిఫికేషన్ అధికారి పల్లంరాజు, దేవస్థానం ఏఈవోలు ఎన్.ఆనంద్‌కుమార్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకులో డిపాజిట్ చేసిన బంగారు ఆభరణాలు



స్టేట్‌బ్యాంకు అధికారికి బంగారు ఆభరణాలు అప్పగిస్తున్న సింహాచలం ఈవో త్రినాధరావు, దేవాదాయశాఖ అధికారులు

తల్లిదండ్రులు డబ్బులివ్వలేదని.. పుట్టినరోజునే కుమారుడి ఆత్మహత్య

విశాఖపట్నం, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు డబ్బులు ఇవ్వలేదని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన విశాఖలోని పీఎంపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలిలా.. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ యువకుడు పీఎంపాలెంలోని ఓ కాలనీలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నాడు. తండ్రి వంట మాస్టర్‌గా పనిచేస్తూ కుమారుడిని చదివిస్తున్నారు. సోమవారం తన పుట్టినరోజు కావడంతో స్నేహితులతో పార్టీ కోసం కొడుకు తల్లిదండ్రులను డబ్బులు అడిగాడు. ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నందున ఇలాంటి ఖర్చులకు దూరంగా ఉండాలని వారు అతడిని వారించారు. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యాన్ హుక్కుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తాము డబ్బులిస్తే కుమారుడు బతికేవాడని పరోక్షంగా ఈ మృతికి తామే కారణమంటూ తల్లిదండ్రులు రోదించడం పలువురిని కలచి వేసింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

పోలీసుల సంక్షేమానికి పెద్దపీట

పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : పోలీసుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. బీచ్‌రోడ్డులో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని సోమవారం ఉదయం అమరవీరుల స్తూపానికి సీపీ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. పోలీసులు బాగుంటే వారి కుటుంబాలు బాగుంటాయన్నారు. సమస్యలు లేకపోతే విధులు సక్రమంగా నిర్వహిస్తారన్నారు. అప్పుడే నగరం ప్రశాంతంగా ఉంటుందన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించేలా త్వరలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా అదనపు బృందాలు ఏర్పాటు చేసి గంజాయి తరలిస్తున్న వారిని అదుపులోకి తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా అమరులైన పోలీసు సిబ్బంది కుటుంబాలకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లాజడ్జి ఆలపాటి గిరిధర్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, గాజువాక ఎమ్మెల్యే, తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, డీసీపీలు, ఏసీపీలు, నగర ప్రముఖులు హాజరై అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీసులు అమరవీరులకు పోలీసు బ్యాండుతో నివాళులు అర్పించారు. మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. వ్యాఖ్యాతలుగా లక్ష్మీ స్వరూప, మమత వ్యవహరించారు.



సంస్మరణ కార్యక్రమంలో పోలీసుల కవాతు



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా అధికారులు, నేతలు, ప్రముఖులు

పెచ్చుమీరిన యూసీడీ సిబ్బంది ఆగడాలు

ఆర్పీపై మహిళల ఫిర్యాదు



కమిషనర్ సంపత్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న మహిళలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థ యూసీడీ (పట్టణ సామాజికాభివృద్ధి) సిబ్బంది ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. మెప్మా నుంచి వచ్చి జీవీఎంసీలో డీసీఎంగా (డిస్ట్రిక్ట్ మిషన్ కో-ఆర్డినేటర్) విధులు నిర్వహించిన అధికారి మహిళా సంఘాల నుంచి రూ.కోట్లు తీసుకున్నట్లు ఇటీవల తెదేపా కార్పొరేటర్ రాపర్తి కన్నా ఆధారాలను బయటపెట్టడంతో కమిషనర్ ఆయన్ను సస్పెండ్ చేశారు. డీసీఎం వ్యవహారంతో పాటు, యూసీడీ సిబ్బంది అక్రమాలపై అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మను విచారణాధికారిగా నియమించారు. త్వరలో ఆయన విచారణ ప్రారంభించనున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న డీసీఎంకు సహకరించిన ఇద్దరు ఆర్పీలను కమిషనర్ సస్పెండ్ చేశారు. అయితే తమను ఎవరూ సస్పెండ్ చేయలేదని మహిళా సంఘాల ప్రతినిధులకు చెబుతూ క్షేత్రస్థాయిలో యూసీడీ వ్యవహారాలన్నీ వారే నడిపిస్తుండడం గమనార్హం. సోమవారం 98వ వార్డుకు చెందిన 70 మంది డ్వాక్రా మహిళలు జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి వచ్చి కమిషనర్ సంపత్‌కుమార్‌ను కలిశారు. ఆర్పీ లక్ష్మీ ప్రసన్న వేధింపులు భరించలేకపోతున్నామని, ప్రతి విషయానికి డబ్బులు డిమాండ్ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తోందని ఫిర్యాదు చేశారు. అధికారులు ఆమెను సస్పెండ్ చేశామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తోందని తెలిపారు. పలువురు యూసీడీ అధికారులు ఆమెకు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను తన వద్ద ఉంచుకుని వడ్డీలు చెల్లిస్తానని చెబుతోందని, ప్రభుత్వ నిధులు, రాయితీలు అందకుండా చేస్తోందని వాపోయారు.

కేజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

పల్మనరీ అర్టెరీలో త్రంబస్ తొలగింపు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కేజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్సను విజయంతంగా నిర్వహించామని ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ శివానంద తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నగరానికి చెందిన హరికృష్ణ (35) ఈనెల 10న మెడికల్ వార్డు నుంచి రిఫరల్ కేసుగా కార్డియో థొరాసిక్ వార్డుకు వెళ్లారు. అతనికి దగ్గుతో పాటు గొంతు నుంచి రక్తం పడేది. థొరాసిక్ విభాగ వైద్యులు పరీక్షలు నిర్వహించగా పల్మనరీ అర్టెరీలో త్రంబస్ (రక్తనాళాలు మూసుకుపోయినట్లు) ఉన్నట్లు గుర్తించారు. దీనికి బయట చికిత్స చేయించుకోవాలంటే రూ.10లక్షల నుంచి రూ.15లక్షల వరకు ఖర్చు అవుతుంది. పైగా శస్త్రచికిత్స హైరిస్కుతో కూడిన వ్యవహారం. ఈ విషయం హరికృష్ణ భార్య, కుటుంబ సభ్యులకు తెలియజేసి, వారి సమ్మతితో ఈనెల 11న క్లిష్టమైన శస్త్రచికిత్సను థొరాసిక్ విభాగ వైద్య బృందం విజయవంతంగా నిర్వహించిందని డాక్టర్ శివానంద వివరించారు. పల్మనరీ అర్టెరీలో 8/3సెంటీ మీటర్ల మేర ఉన్న త్రంబస్‌ను తొలగించడంతో హరికృష్ణ ఆరోగ్యం సాధారణ స్థితికి చేరుకుందన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఉచితంగా చికిత్స అందించామన్నారు. ఇటువంటి వ్యాధులు జన్యుపరంగా రావడానికి అవకాశం ఉందని వివరించారు. థొరాసిక్ విభాగ వైద్యాధికారులు మణిత, పద్మజ, సతీష్, రమేష్, భవానీ బృందాన్ని అభినందించారు.



కోలుకున్న హరికృష్ణతో డాక్టర్ పి.శివానంద, డాక్టర్ మణిత, డాక్టర్ పద్మజ తదితరులు

పూర్వ సీఈపై విచారణకు ఆదేశం!

పెదవాల్తేరు విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ముఖ్య ఇంజినీర్‌గా గతంలో విధులు నిర్వహించిన వి.చంద్రయ్య మీద ప్రభుత్వం శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. ప్రస్తుతం ఆయన పదవీ విరమణ చేశారు. కాలుష్య నియంత్రణకు ఎన్‌టీపీసీ, ఏపీఐఐసీ నిధులతో వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో ప్రాజెక్టు చేపట్టారు. ఆయన సీఈగా ఉండగా నిధుల వినియోగంలో పర్యవేక్షణ లోపాన్ని గుర్తించారు. ఆ పనులకు సాంకేతిక అనుమతులు ఇచ్చిన ఆయన ఆ సంస్థలకు నష్టం కలిగించేలా వ్యవహరించడం, గుత్తేదారుకు మేలు కలిగేలా చేశారన్న విమర్శలపై విచారణకు పురపాలక శాఖ సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది.

విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేత

వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా మండల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, బృంద చర్చ(డిబేట్) పోటీల్లో విజేతలుగా నిలిచిన 63 మంది విద్యార్థులకు సోమవారం కలెక్టర్ హరేంధిరప్రసాద్ కలెక్టరేట్‌లో ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రతి కేటగిరీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, డీఈఓ ఎల్.చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో కలెక్టర్ హరేంధిరప్రసాద్, జేసీ మయూర్ అశోక్, డీఈఓ చంద్రకళ తదితరులు

23న ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం విశాఖ జిల్లా యూనిట్ ఎన్నికలు ఈనెల 23న కేజీహెచ్ ఆవరణలోని నర్సుల క్లాక్‌రూమ్‌లో నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి బి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, తర్వాత ఓట్లు లెక్కించి విజేతలను ప్రకటిస్తామన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న నర్సులంతా ఓటర్లేనన్నారు. వారు ఓటు వేసేందుకు ఏదో ఒక గుర్తింపు కార్డుతో రావాలన్నారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో ప్రచార బ్యానర్లు, ఫ్లెక్సీలు, టెంట్లు ఏర్పాటు చేయరాదని సూచించారు.

కేకే లైన్లో పట్టాలు తప్పిన గూడ్స్

అనంతగిరి, న్యూస్‌టుడే: కేకే (కొత్తవలస-కిరండూల్) రైలుమార్గంలో సోమవారం ఉదయం గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. విశాఖపట్నం వైపు వెళ్తున్న గూడ్స్ బోగీలో ఒక చక్రం అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం చిమిడిపల్లి స్టేషన్ వద్ద కిందకు జారింది. హుటాహుటిన సిబ్బంది అక్కడకు చేరుకుని మరమ్మతులు చేపట్టారు. రూట్ క్లియర్‌గా లేకపోవడంతో మరో గూడ్సు రైలును బొర్రాస్టేషన్ వద్ద నిలిపివేశారు. అదే సమయంలో రైల్వే సిబ్బందికి సంబంధించిన ఓ రైలు నాలుగు బోగీలతో రాగా దాన్ని కూడా బొర్రా స్టేషన్‌లోనే నిలిపారు. ఇవి రెండు వైపులా ఉండటం, అదే సమయానికి కిరండూల్ పాసింజర్ రావడంతో దాన్ని మధ్యలో ఉన్న లైనులో ఆపారు. ప్రయాణికులు దిగేందుకు ప్లాట్‌ఫాం అందుబాటులో లేకపోవడంతో రెండు రైళ్ల మధ్య నుంచి నడుచుకుని బయటకు రావాల్సి వచ్చింది. మరమ్మతుల అనంతరం మిగతా రైళ్ల రాకపోకలకు మార్గం సుగమం చేశారు.





రైళ్ల మధ్య నడుచుకుంటూ వస్తున్న ప్రయాణికులు

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	120	115
లైవ్	142	135
డ్రెస్డ్	206	240
స్కిన్‌లెస్	234	250

తెరపై ఈనాడు పెందుర్తిలో..
లక్ష్మీకాంత్ ప్రీమ్-1 - దేవర
ప్రీమ్-2 - విశ్వం

దుర్గమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే దంపతులు



సబ్బవరం, న్యూస్‌టుడే: పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సోమవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను సతీ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనం అందించారు.

పెందుర్తి

రైతుల సమస్యలను పరిష్కరించాలని వినతి

దేవాడ(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని రైతుల సమస్యలను పరిష్కరించాలని వార్డు తెదేపా అధ్యక్షుడు పాల అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు దేవాడ రైతు సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి సోమవారం సమ్మెడెడ్డి, గొల్లపేట సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాడ ఈనాం భూముల్లో వేలాది ఎకరాల్లో వరి, మామిడి, జీడిమామిడి, సరుగుడు, కొబ్బరి, కూరగాయలు తదితర పంటలను సాగు చేస్తూ రైతులు జీవనం సాగిస్తున్నారన్నారు. అన్నదాతలకు రైతు భరోసా పథకం సొమ్ముతో పాటు రాయితీపై విత్తనాలు, వ్యవసాయ పరికరాలు అందజేయకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా రైతులను కౌలు రైతులుగా గుర్తించి అన్ని పథకాలను వర్తింపజేయాలన్నారు. నాయకులు కాకి శ్రీను, పాల నగేశ్, కాకి నారాయణ, సర్పంచ్ ఆలం రాజా, అత్తిలి లక్ష్మణ పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న అప్పలనాయుడు తదితరులు

పరాయి పంచన అంగన్వాడీ సేవలు



రేబవానిపాలెంలో..

పరవాడ, న్యూస్‌టుడే: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించి వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశాయి. వీటిలో మంచి సేవలు అందించడంతో పాటు ప్రీస్కూల్ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పలు గ్రామాల్లో ఏళ్లు గడుస్తున్నా అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో ఇరుకుగా ఉన్న, సరైన సౌకర్యాలు లేని అద్దె భవనాల్లో నెట్టుకురావడంతో చిన్నారులతో పాటు నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన అంగన్వాడీ భవనాల పనులను అనంతరం వచ్చిన వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల పాటు కనీసం పట్టించుకోకపోవడంతో అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.



సగంలో నిలిచిపోయిన బాపడుపాలెం అంగన్వాడీ భవన నిర్మాణం

చిన్నారుల ఆలనాపాలనకు సరిపోక..

పరవాడ మండలంలోని పలు గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేని కారణంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అవస్థలు దృష్టిలో ఉంచుకుని 2014-19 మధ్య కాలంలో అప్పటి తెదేపా ప్రభుత్వం స్పందించి ఒక్కో భవన నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలు మంజూరు చేసింది. 2018లో శంకుస్థాపన చేసి పనులను వేగవంతం చేశారు. సుమారు 60 నుంచి 80 శాతం వరకు పనులు పూర్తి చేశారు. అనంతరం 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వీటిని కనీసం పట్టించుకోకపోవడంతో అసంపూర్తిగా మిగిలిపోయాయి. భవనాలు అందుబాటులోకి రాకపోవడంతో కేంద్రాలను అద్దె, ప్రయివేట్ భవనాలు, సామాజిక, పాఠశాలల్లో నెట్టుకొస్తున్నారు. ఈ భవనాలు చిన్నారుల ఆలనపాలనతో పాటు సరకులు పెట్టుకోవడానికి సరిపోక, సరైన వసతులు లేకపోవడంతో ఇక్కట్లు పడుతున్నారు. కొన్ని భవనాలు శిధిలావస్థలో ఉండడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని ఈ గ్రామాల్లో..

పరవాడ మండలంలోని రేబవానిపాలెం, గొల్లగుంట, మోటూరువానిపాలెం, సోమునాయుడుపాలెం, గొల్లలపాలెం, పాతరాజానపాలెం, పోలిరెడ్డిపాలెం, గొర్లివానిపాలెం, బాపడుపాలెం, స్వయంభూవరం, వెంకటాపురం, చిన్నన్నపేట గ్రామాల్లో భవనాల పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. గత వైకాపా ప్రభుత్వం కొంత దృష్టి సారించిన వీటి పనులు పూర్తయ్యేవని కనీసం పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అసంపూర్తి భవనాలను పూర్తి చేయాలని పలుమార్లు అప్పట్లో పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి ప్రయోజనం లేకపోయిందని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి అంగన్వాడీ భవన నిర్మాణాలను పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పంచాయతీల్లో సచివాలయాలను విలీనం చేయాలి



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచి సుజాత

పరవాడ, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో సచివాలయాలను విలీనం చేయాలని ముత్యాలమ్మపాలెం సర్పంచి, ఉమ్మడి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షురాలు చింతకాయల సుజాత కోరారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పంచాయతీకి ఒక సచివాలయాన్ని కేటాయించి సచివాలయ సిబ్బందిని అనుసంధానం చేయాలన్నారు. గత వైకాపా ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి సచివాలయంలో 11 మంది ఉద్యోగులను నియమించింది, వారిపై సరైన పర్యవేక్షణ, నియంత్రణ లేకపోవడంతో తీవ్ర గందరగోళంగా తయారైందన్నారు. ఒక్కో పంచాయతీలో రెండు కంటే ఎక్కువ సచివాలయాలను ఏర్పాటు చేశారని అవసరం కంటే ఎక్కువమంది ఉద్యోగులు ఉండటం వల్ల వారికి పని లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో ముత్యాల రావు, రవి పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపట్టనున్నందున పలు గ్రామాలకు మంగళవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఈఈ రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశపాత్రునిపాలెం, ఎస్సీకాలనీ, శేషాద్రినగర్, సాయినగర్‌కాలనీ, పి.భోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రాంతంలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా ఉండదని వెల్లడించారు.

అబ్దుల్‌కలాం ఐపీఆర్ జాతీయ క్విజ్ పోటీలు

సబ్బవరం, న్యూస్‌టుడే: ఏపీజే అబ్దుల్ కలాం మేధో హక్కుల సంపత్తి(ఐపీఆర్) జాతీయ క్విజ్ పోటీలు సోమవారం అంతర్జాలంలో నిర్వహించారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్‌ఎన్‌ఎల్‌యూ)లోని మేధో హక్కుల సంపత్తి, అంతర్జాతీయ వ్యాపార విభాగం(డీపీఐబీటీ) కేంద్రాలు ఈ పోటీలకు సహకారం అందించాయి. మేధో సంపత్తి హక్కులపై విద్యార్థులకు పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు జాతీయ స్థాయిలో ఈ పోటీ నిర్వహించడం జరిగిందని వర్సిటీ ఒక ప్రకటనలో తెలిపింది. డీఎస్‌ఎన్‌ఎల్‌యూ ఉపకులపతి ఆచార్య సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ఈ పోటీని విద్యార్థులు ఒక అవకాశంగా తీసుకోవాలన్నారు. దేశం నలుమూలల నుంచి 24 జట్లు పాల్గొన్నాయి. పుణెలోని సింబయాసిస్ లా స్కూల్ నుంచి జైన్, సవ్యసాచి, నందిత బృందం విజేతగా నిలిచి రూ.5 వేలు, బెంగళూరులోని అలయన్స్ యూనివర్సిటీకి చెందిన కడిమి లక్ష్మి, హర్షిత, మజ్జారి పావని బృందం రన్నరప్‌గా నిలిచి రూ.3 వేల నగదు బహుమతి గెలుచుకున్నారు. డీఎస్‌ఎన్‌ఎల్‌యూ ఫ్యాకల్టీ సమన్వయకర్త, డీపీఐబీటీ ఐపీఆర్ ఛైర్ ప్రొఫెసర్ దయానందమూర్తి, డాక్టర్ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థినికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రదీప్‌ప్రసాదురాజా

పరవాడ, న్యూస్‌టుడే: రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే)లో భాగంగా జీవీఎంసీ 77వ వార్డు పరిధి దేవాడ మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రదీప్ ప్రసాదురాజా, సిబ్బంది విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. పిల్లలకు పుట్టుకతో వచ్చే 4డీ వ్యాధుల నిమిత్తం స్క్రీనింగ్ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఎన్ అన్నపూర్ణ, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసరావు, హెచ్‌ఎస్ గోపాలం, దేవి తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే వెలుగులు



పరవాడ, న్యూస్‌టుడే: అధికారుల నిర్లక్ష్యం కారణంగా వీధుల్లోని విద్యుత్తు దీపాలు నిత్యం వెలుగుతూ విద్యుత్తును వృథా చేస్తున్నాయి. పరవాడ సినిమా హాల్ కూడలిలోని ఎల్‌ఈడీ దీపం గతకొద్ది రోజులుగా నిరంతరాయంగా వెలుగుతున్నా పట్టించుకునే వారే కరవయ్యారని స్థానికులు వాపోతున్నారు. విద్యుత్తు పొదుపు గురించి అవగాహన కల్పించే అధికారులు విద్యుత్తును వృథా చేయడం పట్ల గ్రామస్థులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పగటి వెలుగులకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, పీడీ నర్సింహమూర్తితో ఎంపికైన బాలికలు

ఇస్లాంపేట(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డు పరిధి ఇస్లాంపేట జిల్లా పరిషత్తు ఉన్న పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు విశాఖ ఉమ్మడి జిల్లా తరఫున రాష్ట్ర స్థాయి హాకీ, చెస్ పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలోని ఈనెల 10న పోర్టు హైస్కూల్ మైదానంలో జరిగిన అండర్-17 చెస్ పోటీల్లో పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థినులు చెందిన అనిత బోహిపాయి, పురుషోత్తం వాసవి హాకీలో రాణించగా నీతాకుమారి అనకాపల్లి జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్ -17 చెస్ పోటీల్లో ప్రతిభ చాటింది. ఈ ముగ్గురు త్వరలోనే జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ ఎస్.నర్సింహమూర్తి తెలిపారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విజేతలను ప్రధానోపాధ్యాయిని జి.ప్రమీల, ఉపాధ్యాయులు అభినందించారు.

పరవాడలో రెవెన్యూ సదస్సు రేపు

పరవాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రం పరవాడ సంతబయలు వద్ద బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అంబేడ్కర్ సోమవారం తెలిపారు. షెడ్యూల్ ప్రకారం పరవాడలో మంగళవారం ఈ సదస్సు జరగాల్సి ఉండగా వారపుసంత కారణంగా బుధవారానికి వాయిదా వేయడం జరిగిందన్నారు. రీసర్వేలో సమస్యలు ఉన్నవారు సదస్సుల్లో పాల్గొని అర్జీలు పెట్టుకోవాలన్నారు.

ప్రయాణమంటే సాహసం చేయాల్సిందే..!



బురదగా మారిన రహదారి

సబ్బవరం, న్యూస్‌టుడే: ఆ దారిలో ప్రయాణించాలంటే సాహసం చేయాల్సిందే.. లేదంటే 26 కిలోమీటర్లు చుట్టూ తిరిగి గమ్యస్థానానికి చేరుకోవాలి. సబ్బవరం మండలం అసకపల్లి నుంచి పరవాడ మండలం లంకెలపాలెం వెళ్లే రహదారిలో ప్రయాణం నానాటికీ ప్రమాదకరంగా మారుతోంది. రాకాసి గుంతలు కారణంగా వర్షపు నీరు నిలిచిపోయి బురదగా మారుతోంది. దిచక్రవాహన, ఆటో చోదకులు భయాందోళన మధ్య రాకపోకలు సాగిస్తున్నారు. ఏ వాహనం ఎప్పుడు కూరుకుపోతోందో తెలియని పరిస్థితి. సోమవారం అసకపల్లి నుంచి లంకెలపాలెం వెళ్తున్న ఓ ఆటో అసకపల్లి దాటిన వెంటనే ఓ గుంత వద్ద అదుపుతప్పి ఒరిగిపోతుండగా ఇతర ఆటో చోదకులు ఆటోను పట్టుకుని ప్రయాణికులను కిందకు దించి రక్షించారు. సబ్బవరం మండలానికి చెందిన వారు లంకెలపాలెం వెళ్లాలంటే అసకపల్లి నుంచి అనకాపల్లి వెళ్లి అక్కడి నుంచి లంకెలపాలెం వెళ్తున్నారు. దీనివల్ల 12 కిలోమీటర్లకు బదులు అదనంగా మరో 14 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. దీనివల్ల ప్రయాణికుల నుంచి రెట్టింపు వసూలు చేయాల్సి వస్తోందని ఆటో చోదకులు వాపోతున్నారు. దీనివల్ల ప్రజలు ఆటోలు ఎక్కడం మానేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



ఒరిగిపోతున్న ఆటోను పట్టుకుంటున్న డ్రైవర్లు

యూసీడీ ఇన్‌ఛార్జి ఏపీడీగా చిరంజీవి



వేపగుంట, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-8 యూసీడీ ఇన్‌ఛార్జి ఏపీడీగా టి.చిరంజీవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జీవీఎంసీ పలు విభాగాల్లో నిర్వహించిన బదిలీల్లో భాగంగా జోన్-5 యూసీడీ ఏపీడీగా పనిచేసిన చిరంజీవి జోన్-8కు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఏపీడీ శ్రీరాం మధురవాడకు బదిలీ అయ్యారు. విధుల్లో చేరిన చిరంజీవిని వివిధ సచివాలయాల కార్యదర్శులు, పొదుపు సంఘాల మహిళలు జోనల్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి ఆదర్శ్ డిగ్రీ కళాశాల బీబీఏ విద్యార్థుల పారిశ్రామిక సందర్శన సోమవారం నిర్వహించారు. అధ్యాపకురాలు జి.పరిమళ ఆధ్వర్యంలో విద్యార్థులు చోడవరంలోని సహకార చక్కెర కర్మాగారాన్ని సందర్శించినట్లు ప్రిన్సిపల్ ఎన్.ఈ.ఫ్లోరా తెలిపారు. మేనేజ్‌మెంటు విద్యలో భాగంగా విద్యార్థులకు క్షేత్రస్థాయి అనుభవం కోసం ఈ సందర్శన ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.



చోడవరం చక్కెర కర్మాగారంలో విద్యార్థులు

రహదారిలో గోతుల పూడ్చివేత



గోతుల్లో కాంక్రీటు వేస్తున్న దృశ్యం

పురుషోత్తపురం(పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 95వ వార్డు పరిధిలోని పురుషోత్తపురం - కంఫర్ట్ హోమ్స్ రహదారిలో గోతులు కారణంగా ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు దృష్టికి తీసుకెళ్లారు. ఆ మేరకు ఆయన ఆదివారం కాలనీలో పర్యటించి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. యూజీడీ పనుల కారణంగా ఏర్పడిన గోతులను సోమవారం జీవీఎంసీ సిబ్బందితో పూడ్చివేయించారు.

నిరుపయోగంగా బస్‌షెల్టర్



ఫోకస్

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండల పరిషత్తు కూడలిలో బస్‌షెల్టర్ పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. షెల్టర్ పరిసరాల చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో పాటు విష పురుగుల సంచారం కారణంగా షెల్టర్‌ను ప్రయాణికులు వినియోగించడం లేదు. లోపల బెంచీలు దుమ్ము, ధూళితో దర్శనమిస్తున్నాయి. కూడలిలోని విద్యాశాఖ, తహసీల్దార్, మండల పరిషత్తు, వెలుగు, ఉపాధిహామీ, పోస్టల్, పశువైద్యం, హౌసింగ్, వ్యవసాయ తదితర కార్యాలయాలు ఉండటంతో ఇక్కడి నుంచి ఎక్కువమంది ఉద్యోగులతో పాటు ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వీరంతా బస్సులు వచ్చేవరకు ప్రయాణికులు బయటే ఉండాల్సిన పరిస్థితి నెలకొంటోంది. షెల్టర్ ఉన్నా ఉపయోగం లేదని వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి షెల్టర్ పరిసరాలను శుభ్రం చేయించి వినియోగంలోకి తేవడానికి చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సరిపల్లి వాసికి ఆంధ్రరత్న పురస్కారం

సరిపల్లి(పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తి మండలం సరిపల్లి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కోనేటి ఆదినారాయణకు అఖిల భారత సాంస్కృతిక సంఘం ఆంధ్రరత్న పురస్కారాన్ని ప్రదానం చేసింది. విజయవాడలో సోమవారం నిర్వహించిన సంఘం వార్షికోత్సవాల్లో భాగంగా ఈ పురస్కారాన్ని అందజేసినట్లు ఆదినారాయణ తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించిన నేపథ్యంలో ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఆదినారాయణ పేర్కొన్నారు.



అతిథుల చేతులమీదుగా పురస్కారం అందుకుంటున్న ఆదినారాయణ

జిల్లాలోని 29 సాగునీటి సంఘాలకు ఎన్నికలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలోని 29 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ హరేంధిరప్రసాద్ సోమవారం ఎన్నిక నోటిఫికేషన్ విడుదల చేశారని చెప్పారు. ఆయా సాగునీటి ఆయకట్టు పరిధిలోని రైతులు సభ్యులుగా ఉంటారని చెప్పారు. నవంబరు 21 నుంచి 23 వరకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈలోపు ఓటరు జాబితాల తయారీ, ప్రాదేశిక నియోజకవర్గాల ఏర్పాటు తదితర ప్రక్రియలను పూర్తి చేస్తామన్నారు.

రెవెన్యూ గ్రామ సభకు 82 దరఖాస్తులు



రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం అసకపల్లి శివారు ఎరుకనాయుడుపాలెం గ్రామంలో సోమవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. రీసర్వేలో తమకు అన్యాయం జరిగిందని, భూమి తగ్గిపోయిందని, తమ పేర్లు తప్పుగా నమోదయ్యాయని 82 మంది రైతులు అభ్యంతరాలతో కూడిన దరఖాస్తులు అందించారు. ఈ సందర్భంగా తహసీల్దారు బి.చిన్నికృష్ణ మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 90 సర్వే నెంబర్లు ఉన్నాయన్నారు. ప్రభుత్వ భూమి 485.89 ఎకరాలు, జిరాయితీ 431 ఎకరాలు అని తెలిపారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ వై.గణేశ్, సర్వేయర్లు ఎల్.అప్పారావు, రాంబాబు, వీఆర్వోలు దొగ్గ ఈశ్వరరావు, సర్పంచి కర్రి నర్సింగరావు, చల్లా అప్పలనాయుడు, మొల్లి చిన్నారావు, గవర సత్యనారాయణ, గవర అప్పారావు తదితరులు పాల్గొన్నారు

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: సుజాతనగర్‌లోని పూర్ణ పుష్కల సమేత ధర్మశాస్తా అయ్యప్ప స్వామి దేవాలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. సాంబసదాశివుడి వాయు ప్రతిష్ఠ, నంది విగ్రహం, అయ్యప్ప స్వామి సన్నిధిలో మహాగణపతి, మాళికాపురమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన జరిపారు. సుజాతనగర్‌కు చెందిన విగ్రహదాతలు రామునాయుడు, చంద్రకళ, ఐ.భాస్కరరావు, ప్రవళిక దంపతులు అధివాస పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు విశేష పూజలు, హోమాలు జరిపారు. అనంతరం ఆలయ శిఖర కలశ ప్రతిష్ఠాపన సంప్రదాయబద్ధంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



విగ్రహాలకు పూజలు చేస్తున్న దాతలు

మంచినీటి బోర్లకు మరమ్మతులు



మోదీస్ట్రీట్‌లో బోరు బాగు చేస్తున్న జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం సిబ్బంది

వేపగుంట, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-8 పరిధిలోని పలువార్డుల్లో పాడైన బోర్లకు మంచినీటి సరఫరా విభాగం సిబ్బంది సోమవారం మరమ్మతులు చేశారు. 'బోరుమంటున్నాయి' శీర్షికతో ఈనెల 20న ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి సంబంధిత శాఖ అధికారులు స్పందించారు. వెంటనే జోన్ పరిధిలో అన్ని మంచినీటి బోర్లను ఒకేసారి సిబ్బందితో పరిశీలన చేయించారు. పాడైన చేతిపంపుల్లో మంచినీరు వచ్చేవాటిని ముందుగా బాగు చేయించారు. 93వ వార్డు మోదీస్ట్రీట్, విరాట్‌నగర్, 98వవార్డు సింహపురికాలనీల్లో బోర్లు వెంటనే బాగు చేయించారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పైపులైన్ లీకేజీకి అడ్డుకట్ట

స్పందనకు వందనం

పరవాడ, న్యూస్‌టుడే: మేజరు పంచాయతీ పరవాడ బొంకుల దిబ్బ వీధిలోని తాగునీటి పైపులైన్‌కు సోమవారం సంబంధిత సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. ఇక్కడి రహదారిని ఆనుకుని ఉన్న రక్షిత మంచినీటి పథకానికి చెందిన పైపులైన్ దెబ్బతిని గత కొద్దిరోజులుగా తాగునీరు వృథాగా పోతోంది. 'తాగునీరు నేలపాలు' శీర్షికతో ఈనెల 19న 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు పంచాయతీ అధికారులు స్పందించారు. పైపులైన్‌కు మరమ్మతులు చేయించి తాగునీటి వృథాకు అడ్డుకట్ట వేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

రాష్ట్ర స్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో ప్రతిభ

సబ్బవరం, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి 43వ సీనియర్ షూటింగ్‌బాల్ పోటీలు అనంతపురం జిల్లాలోని శ్రీనేతాజీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఈనెల 19 నుంచి 21 వరకు నిర్వహించారు. ఈ పోటీల్లో అనకాపల్లి జిల్లా తరఫున బాలుర టీం నుంచి 12 మంది, బాలికల టీం నుంచి 12 మంది పాల్గొన్నారని షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పైలా ప్రవీణ్ తెలిపారు. ఇరుజట్లు రన్నర్స్‌గా నిలిచాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను ఆయన అభినందించారు.



రన్నర్స్‌గా నిలిచిన అనకాపల్లి జిల్లా బాలురు, బాలికల జట్లు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నాలుగు అర్జీలు

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నాలుగు అర్జీలు వచ్చాయి. జెడ్సీ హేమవతి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని అర్జీదారులకు హామీ ఇచ్చారు. 98వ వార్డు అడివివరం గురుకుల పాఠశాలలోని మంచినీటి బోరుకు మరమ్మతులు చేయాలని, బీఆర్టీఎస్ రహదారిలో భూమి కోల్పోయిన తమకు టీడీఆర్‌లు ఇప్పించాలని, బీఆర్టీఎస్ రహదారి పక్కన భవన నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని, నరవ చర్చి వద్ద రోడ్డు ఆక్రమణలను తొలగించి సమస్య పరిష్కరించాలని అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో డీఈ విజయ్‌కుమార్, ఏఎంహెచ్‌వో అప్పలనాయుడు, ఆర్‌వో నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారుల సమస్యలు వింటున్న జెడ్సీ హేమవతి

అభివృద్ధి పనుల పరిశీలన

వేపగుంట, న్యూస్‌టుడే: జీవీఎంసీ 94వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. వేపగుంట - పాతగోశాల రహదారి బస్టాప్ సమీపంలో ఓపెన్ జిమ్ పరికరాలు మరమ్మతులకు గురయ్యాయని, వాటిని తొలగించి కొత్త పరికరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం గౌతంనగర్, కృష్ణరాయపురంలో నిర్మిస్తున్న డ్రైనేజీ నిర్మాణాన్ని పరిశీలించారు. నాణ్యతలో లోపం లేకుండా పనులు చేపట్టాలని గుత్తేదారు, ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఆయన వెంట మామిడి కిరణ్ తదితరులు ఉన్నారు.



ఓపెన్ జిమ్ పరికరాల ఏర్పాటును పరిశీలిస్తున్న కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు

సినిమాలు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే

గణేష్ – జనక అయితే గనక
రామలక్ష్మి – దేవర
శరత్ – వేట్టయాన్ ది హంటర్
సప్తగిరి – విశ్వం, వేట్టయాన్ ది హంటర్
చెల్లంకి – వేట్టయాన్ ది హంటర్

పార్టీ సభ్యత్వ నమోదుపై ఇంటింటికీ ప్రచారం

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి ప్రాంతంలో తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెదేపా రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు పేర్కొన్నారు. ఇందు కోసం ఈనెల 26వ తేదీ నుంచి చేపట్టనున్న నమోదు ప్రక్రియలో యువతీ యువకులను ఎక్కువగా చేర్పించేందుకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని నూకరాజు కోరారు.

భీమిలి

తగరపువలస, న్యూస్‌టుడే

సమస్య: సంగివలస ఎన్నారై కళాశాల మార్గంలో రహదారి అధ్వానంగా ఉంది. –ఆర్‌రెడ్డి (సంగివలస)

సమాధానం: మరమ్మతులు చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతాం. –సుమన్ (భీమిలి జోన్ ఏఈ)

సమస్య: తగరపువలస సత్యనారాయణపేటలోని ఎన్టీఆర్ బాలల పార్కుకు పూర్వ వైభవం తేవాలి. –బడిగంటి నీలకంఠం (తగరపువలస)

సమాధానం: పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. –ప్రేమ ప్రసన్నవాణి (భీమిలి జోనల్ కమిషనరు)

మేమున్నాం.. మీకు తోడుగా
80086 11711, 99122 22247
సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

సమస్య: తగరపువలస-భీమిలి రోడ్డులో పలుచోట్ల విద్యుత్తు దీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నాం. –పవన్ (తగరపువలస)

సమాధానం: క్షేత్రస్థాయిలో పరిశీలించి దీపాలు ఏర్పాటు చేస్తాం. –ప్రేమ ప్రసన్నవాణి (భీమిలి జోనల్ కమిషనరు)

మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ముందడుగు

❑ రోడ్లు, కాలువలు, వంతెనల నిర్మాణాలకు శ్రీకారం ❑ జోన్-2 జెడ్సీ పి.సింహాచలంతో 'ముఖాముఖి'



ముఖాముఖి

కొమ్మాది, న్యూస్‌టుడే: ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జీవీఎంసీ జోన్-2లో పారదర్శక పాలన అందించి ప్రజల మన్ననలు పొందేందుకు కృషి చేస్తున్నామని జెడ్సీ పి.సింహాచలం తెలిపారు. వార్డుల్లో గుర్తించిన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో దశలవారీగా పరిష్కరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ఈ జోన్ పరిధిలోని 5 నుంచి 13 వార్డుల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, ఇతరత్రా సమస్యల పరిష్కారానికి తీసుకొంటున్న చర్యలపై 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో ఆయన పలు విషయాలు వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

ప్రజలను నేరుగా కలుసుకుని సమస్యలు గుర్తించి, వాటిని పరిష్కరించేందుకు ఉదయం వేళ.. వార్డు పర్యటనలు చేస్తున్నాం. ★ వార్డుల్లో 91 క్లాప్ వాహనాలతో 1,06,463 గృహాల నుంచి 464 మంది కార్మికులు తడి, పొడి చెత్త సేకరించి కాపులుప్పాడ డంపింగ్‌యార్డ్‌కు తరలిస్తున్నారు. మిగతా 173 మంది కార్మికులతో కాలువలు, అంతర్గత రహదారులు, ప్రధాన మార్గాల్లో శుభ్రం చేయిస్తున్నాం.

★ 5, 6, 7 వార్డుల్లో 22చోట్ల రూ.4.17 కోట్లతో అంతర్గత రహదారులు, కాలువలు, వంతెనల నిర్మాణాలకు శ్రీకారం చుట్టాం. టెండర్ ప్రక్రియ సైతం పూర్తయింది.

★ దోమల బెడద తగ్గించేందుకు కాలువల్లో మురుగునిల్వలు తొలగించి ఫాగింగ్ చేయిస్తున్నాం.

★ ఇంటి ప్లాన్, పన్నుల విధింపు, పింఛన్లు, జనన మరణ ధ్రువపత్రాలు వంటి సేవలు సచివాలయాల్లో పొందడంతో పాటు సిటిజన్ చార్టర్‌ను సైతం అందుబాటులోకి తీసుకొచ్చాం. ఇక్కడ నిర్ణీత రుసుములు, అవసరమైన పత్రాలు సమర్పించి గడువులోగా సేవలు పొందవచ్చు. అనవసర జాప్యం వాటిల్లితే సంబంధిత సెక్షన్ అధిపతి నుంచి సహచట్టం ప్రకారం అపరాధ రుసుంతో నష్టపరిహారం సైతం పొందవచ్చు.

★ పందులను జనావాసాలకు దూరంగా తరలించకుంటే షూటర్లతో నిర్మూలించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. రోడ్లపై పశువులను విడిచిపెడితే సంబంధిత యజమానికి జరిమానా విధిస్తున్నాం. కుక్కలను పట్టుకుని కు.ని.ఆపరేషన్లు చేసి విడిచిపెడుతున్నాం.

★ ప్రతి సోమవారం పీజీఆర్ఎస్‌లో వచ్చే వినతులతో పాటు కాల్‌సెంటర్ ద్వారా, ఆన్‌లైన్‌లో అర్జీలు వస్తున్నాయి. వాటిని శాఖల వారీగా సంబంధిత అధికారులకు అందిస్తున్నాం.

★ ప్రతి సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. అంతేకాక సచివాలయాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు వినతులు స్వీకరిస్తున్నాం. ఆన్‌లైన్‌లో pgrs.ap.gov.in టైప్ చేస్తే పోర్టల్ తెరుచుకుంటుంది. అందులో కూడా సమస్య తెలియజేయవచ్చు. కార్యాలయ పనివేళల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నేరుగా తనకు ఫిర్యాదు చేయవచ్చు.



కొమ్మాది కూడలి నుంచి సాయిరాంకాలనీ వరకూ రహదారికి మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

శాఖల వారీగా అధికారుల చరవాణి నంబర్లు

పారిశుద్ధ్య విభాగం	ఏఎంహెచ్‌వో	డాక్టర్ కిశోర్	88863 38111
తాగునీటి సరఫరా	ఈఈ	సురేష్	63098 60485
పట్టణ ప్రణాళిక	ఏసీపీ	ఎస్.ఆష్షిక్‌ఖాన్	98489 33236
వీధిదీపాలు	ఈఈ	సురేష్	77299 95960
ఇంజినీరింగ్	ఈఈ	శ్రీనివాస్	77299 95918
యూసీడీ	పీడీ	వై.వై.శ్రీరామ్	77299 99788
రెవెన్యూ (పన్నులు)	ఆర్వో	శివకుమార్	98481 11572

పీజీఆర్ఎస్‌పై ప్రజల్లో నమ్మకం కలిగించాలి: ఎమ్మెల్యే

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా స్వీకరిస్తున్న ప్రతి అర్జీని నిర్ణీత గడువులో పరిష్కరించి ఈ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం కలిగించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. భీమిలి మండల పరిషత్తు కార్యాలయంలో ప్రతివారం మాదిరిగానే సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భీమిలి జోనల్ కార్యాలయంలో ప్రతి వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు మాదిరిగానే మండల పరిషత్తు, తహసీల్దారు కార్యాలయంలో ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చూపినా, అలసత్వం వహించినా తీవ్ర చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె.ఎస్. మాధుర్, ఎంపీడీవో ఎన్.హనుమంతరావు, తహసీల్దారు రామారావు, జెడ్సీ ప్రేమ ప్రసన్నవాణి, మండల తెదేపా అధ్యక్షుడు డీఏఎన్ రాజు, జడ్పీటీసీ సభ్యుడు గాదం వెంకటరావు, నాయకులు నరగిద అప్పారావు, బోర బంగారురెడ్డి, పాసి నర్సింగరావు, కొప్పల రమేష్, తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

వినతుల స్వీకరణ

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జెడ్సీ పి.సింహాచలం అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను పరిశీలించి సంబంధిత విభాగాలకు పంపారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులకు జెడ్సీ సూచించారు.

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి జోనల్ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్‌కు అయిదు వినతులు లభించాయి. ఇందులో ఇంజినీరింగ్, యూసీడీ విభాగానికి రెండేసి, పట్టణ ప్రణాళికా విభాగానికి ఒకటి వచ్చాయి. వీటిని పరిష్కరించే నిమిత్తం ఆయా విభాగాలకు బదలాయించినట్లు భీమిలి జెడ్సీ పి.ప్రేమప్రసన్న వాణి పేర్కొన్నారు.

సీఎం సహాయనిధికి విరాళం

మధురవాడ, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి మధురవాడ పౌరసంక్షేమ సంఘం సభ్యులు విరాళం అందించారు. సభ్యులంతా కలిసి సంయుక్తంగా సేకరించిన రూ.50 వేల చెక్కును సంఘం అధ్యక్షులు నాగోతి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును సోమవారం ఆయన నివాసంలో కలిసి అందజేశారు. బెల్లపు పాపారావు, శ్రీపాద వెంకటరమణ, జగన్‌మోహన్‌చౌదరి, పి.నాగేశ్వరరావు, వి.శ్రీనివాసరావు, బి.సతీష్‌కుమార్, ఎన్.బాబ్జి, టి.ఆషాస్వరూప్, డాక్టర్ ఎస్.రమేష్, డి.శ్రీనివాసరెడ్డి, ఆశాజ్యోతి, బి.ఎన్.రావు, ఎం.సతీష్, ప్రసాదరావు, ఎస్.కె.కరీం తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు చెక్కు అందజేస్తున్న మధురవాడ పౌరసంక్షేమ సంఘం సభ్యులు

నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లే..

పీఎంపాలెం, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై మధురవాడ ప్రాంతాల్లో ఎప్పుడు ట్రాఫిక్ నిలిచిపోతుందో అర్థం కాని పరిస్థితి. క్రికెట్ స్టేడియం, మారికవలస మధ్య 2 కి.మీ దూరం ప్రయాణమంటే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. సంబంధిత పరిధిలోని నాలుగు కూడళ్లలో సిగ్నలింగ్ వ్యవస్థ కొనసాగుతోంది. ప్రధానంగా విద్యాలయాలు, ఉద్యోగ, వ్యాపార కార్యకలాపాలకు వెళ్లి వచ్చే సమయాల్లో తీవ్ర రద్దీ నెలకొంటోంది. ఈ సందర్భంలో ఆయా కూడళ్లు దాటి వెళ్లేందుకు ఒక్కోసారి గంటకు పైగా సమయం వెచ్చించాల్సి వస్తోందని వాహనచోదకులు వాపోతున్నారు. ఎప్పటికప్పుడు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నా పీఎంపాలెం ట్రాఫిక్ పోలీసులు మాత్రం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఎంతో ప్రాధాన్యం కల్గిన ఈ సమస్యపై నగర కమిషనర్ దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



జాతీయ రహదారిపై మధురవాడ-కారుషెడ్డు మధ్య ఇలా..

జ్యూటు మిల్లు యాజమాన్యంపై చర్యలు చేపట్టాలి

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: చిట్టివలస జ్యూటుమిల్లు జీవీఎంసీకి చెల్లించాల్సిన రూ.26 కోట్ల ఆస్తిపన్ను బకాయిలను వెంటనే వసూలు చేయాలని తెదేపా నగర కార్యదర్శి పిట్టా సురేశ్ సోమవారం జీవీఎంసీ కమిషనరు సంపత్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఆస్తిపన్ను చెల్లించకుండానే మిల్లు యాజమాన్యం తన భూములను అమ్ముకోవడానికి, లేఅవుట్లు నిర్మించడానికి ప్రభుత్వపరంగా ఎలా అనుమతులు వచ్చాయన్న దానిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.

నిత్యావసరాల ధరలు నియంత్రించాలి



ప్రజలకు కరపత్రాలు అందిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు తదితరులు

మధురవాడ, న్యూస్‌టుడే: సామాన్య, మధ్యతరగతి ప్రజలు నిత్యావసరాల ధరల పెరుగుదలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు అన్నారు. 8వ వార్డు పరిధి పాత మధురవాడ మెట్ట ప్రాంతంలో సోమవారం ఇంటింటికీ ర్యాలీగా వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ధరలు ఇష్టానుసారం పెరుగుతున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. కూరగాయలు, పప్పులు, వంటనూనె తదితరాలన్నీ కొండెక్కి కూర్చున్నాయన్నారు. తీవ్రమైన ధరాభారం వల్ల ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా జోక్యం చేసుకుని ధరల నియంత్రణపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకుడు టి.సత్యనారాయణ, మధురవాడ ఏరియా కార్యదర్శి వాండ్రాసి సత్యనారాయణ, కె.అరుణ్‌కుమార్, ఎన్.త్రినాధ్, పి.రమణ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. నరహరి నిత్యకల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహస్వామివారి నిత్య కల్యాణోత్సవం సోమవారం సింహగిరిపై కమనీయంగా జరిగింది. అర్చకులు దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని శోభాయమానంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయ వేడుకను జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.



విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు

ఘనంగా దామోదర మాసోత్సవాలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో జరుగుతున్న కార్తిక దామోదర మాసోత్సవాల్లో భాగంగా సోమవారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల నడుమ ఉత్సవమూర్తుల్ని దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథస్వామి విగ్రహాల్ని దీపాలతో అలంకరించిన తీరు ఆకర్షణీయంగా నిలిచింది. ఈ మాసోత్సవాల్ని పురస్కరించుకుని వచ్చేనెల 15వ తేదీ వరకు ప్రతి రోజూ తెల్లవారుజామున 4-30 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ప్రత్యేకపూజలు ఉంటాయని ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ పేర్కొన్నారు.

విలాస్‌ఖాన్‌పాలెంలో ప్రత్యేక పూజలు

పద్మనాభం, న్యూస్‌టుడే : విలాస్‌ఖాన్‌పాలెం గ్రామ దేవత శ్రీబంగారమ్మతల్లి ఆలయ పునః ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం వైభవంగా జరిగింది. ఇప్పటి వరకు ఉన్న పాత ఆలయాన్ని తొలగించి ఆ ప్రదేశంలో విశాలమైన నూతన మందిరాన్ని నిర్మించారు. అమ్మవారి కొత్త విగ్రహం తెప్పించి సోమవారం ప్రాణ ప్రతిష్ఠ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



బంగారమ్మతల్లి అమ్మవారు

అర్ధరాత్రి అదృశ్యమై... ఉదయం నానమ్మ చెంతకు చిన్నారి

పీఎంపాలెం, న్యూస్‌టుడే: ఇంటి నుంచి అదృశ్యమైన ఓ చిన్నారి నానమ్మ చెంతకు చేరిన ఘటన సోమవారం పీఎంపాలెం స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. దీనిపై పోలీసుల కథనం ప్రకారం.....రుషికొండకు చెందిన కె.మాధవి కుమార్తె అమల(8)తో కలిసి స్థానికంగా నివసిస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి తల్లి నిద్రిస్తున్న సమయంలో చిన్నారి నానమ్మ వద్దకు వెళ్లేందుకు ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయట కొచ్చింది. తగరపువలస వలందపేటలో ఉంటున్న నానమ్మ వద్దకు ఎలా వెళ్లాలో తెలియక నడుచుకుంటూ రుషికొండ కూడలికి చేరుకుంది. ఇదే సమయంలో రుషికొండలో ఉంటూ స్విగ్గీ డెలివరీ బాయ్స్‌గా పని చేస్తున్న ఇద్దరు అన్నదమ్ములు నగరం నుంచి వస్తూ చిన్నారిని గుర్తించారు. ఆమెకు వివరాలు అడగ్గా నానమ్మ వద్దకు వెళ్లాలని ఏడుస్తూ చెప్పింది. దీంతో వారిరువురు చిన్నారిని తమ ఇంటికి తీసుకెళ్లారు. రేపు ఉదయం నానమ్మ వద్దకు తీసుకు వెళ్తామంటూ భోజనం తినిపించి నిద్ర పుచ్చారు. వేకువజామున తల్లి నిద్ర లేచి చూడగా కుమార్తె కనిపించలేదు. అంతటా వెతికినా ఆచూకీ లేకపోవడంతో ఆందోళన చెంది పోలీసు కంట్రోల్ రూమ్ (112)కు ఫిర్యాదు చేశారు. పీఎంపాలెం పోలీసులు ముమ్మరంగా గాలించినా ఫలితం లేకపోయింది. ఉదయం 9 గంటల సమయంలో సంబంధిత యువకులు చిన్నారిని తమ ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని వలందపేటలో ఉన్న అమ్మమ్మ ఇంటికి అప్పగించి వెళ్లిపోయారు. తర్వాత ఈ చిన్నారి తప్పిపోయిందన్న విషయం తెలుసుకున్న నానమ్మ కుటుంబీకులు ఆమె తల్లికి సమాచారం అందించారు. ఎట్టకేలకు రాత్రి నుంచి కనిపించని చిన్నారి క్షేమంగా ఉందని తెలియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై ఎలాంటి కేసు నమోదు చేయలేదని పీఎంపాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపారు.

4జి సేవలు షురూ....

పద్మనాభం, న్యూస్‌టుడే : పద్మనాభం మండల పరిధిలోని బి.ఎస్.ఎన్.ఎల్ వినియోగదారులకు ఇకపై 4జి సేవలు అందుబాటులోకి వచ్చినట్లు ఆ సంస్థ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలందించడంలో భాగంగా ఈ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. దీన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డీఎస్సీకి ఉచిత శిక్షణ

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌కు హాజరవుతున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ డి.డి. రామారావు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. http://mdfc.apcfss.in, http://janabhumi.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తుకు ఈనెల 25 వరకు గడువు పెంచినట్లు తెలిపారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం

కాపులుప్పాడ(గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: జీవీఎంసీ నాల్గోవార్డు భీమిలి మండలం కాపులుప్పాడ పరిధి పాత పరదేశిపాలెంలోని విలువైన ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైంది. ఇక్కడ సుమారు రెండు సెంట్ల విలువైన బంజరు భూమిని ఆక్రమించి ఓ వ్యక్తి ఇటీవల రేకుల షెడ్డు నిర్మించాడు. ఈ ప్రాంతంలో కళ్లముందే అక్రమంగా రేకుల షెడ్డు నిర్మించినా రెవెన్యూ, పట్టణ ప్రణాళికా విభాగాలు చూసీచూడనట్లు వ్యవహరించడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

అ వీ ఇ వీ

భగవద్గీతపై ఇంటింటి ప్రచారం

పీఎంపాలెం, న్యూస్‌టుడే: ప్రపంచ వ్యాప్తంగా ప్రతి మానవుని జీవన గమనానికి భగవద్గీత శ్లోకాలు ఎంతగానో దోహదమని త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి, హిందూ జ్ఞాన వేదిక విశాఖ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. భగవద్గీత ప్రచారంలో భాగంగా సోమవారం పీఎంపాలెం ప్రాంతాల్లో సభ్యులు వంద అనుబంధ గ్రంథాల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. సర్వమానవాళికి ప్రథమ దైవ గ్రంథం భగవద్గీత అని, గీతలో ఉన్న ధర్మాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రమేష్, అప్పారావు, అక్షయ్‌కుమార్, దేవి, లక్ష్మి, మంగ, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో జట్ల ఎంపికలు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పీఎంపాలెం క్రికెట్ స్టేడియం సమీపంలో ఉన్న సాంకేతిక విద్యాపరిషత్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏయూ అంతర కళాశాలల తైక్వాండో పురుషులు, మహిళల జట్ల ఎంపికలు సోమవారం జరిగాయి. పర్యవేక్షణాధికారి డి.దిలీప్‌కుమార్ నేతృత్వంలో నిర్వహించిన ఎంపికల పోటీల్లో వివిధ కళాశాలల నుంచి మహిళలు 21మంది, పురుషులు 27 మంది పాల్గొని ప్రతిభ చాటారని కళాశాల వ్యాయామ విభాగం అధికారులు సురేష్, రాజారావు, వెంకట్‌కుమార్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏయూ వ్యాయామ విభాగం సంచాలకులు ప్రొఫెసర్ ఎన్.విజయమోహన్, సంబంధిత విభాగం విభాగాధిపతి డాక్టర్ ఎ.పల్లవి, కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మధుభట్, హెచ్‌ఆర్ అండ్ సీఆర్ అక్షత కొండూర్, అడ్మిషన్స్ అధికారి, సమన్వయకర్త ఎ.నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ టి.వి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక మజిలీలో... సహపంక్తి భోజనం

మధురవాడ, న్యూస్‌టుడే: ఒకే కుటుంబానికి చెందిన బంధువులంతా బీచ్‌రోడ్డులోని పర్యాటక ప్రాంతాల సందర్శనలో భాగంగా విచ్చేసి రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌పై కూర్చుని సహపంక్తి భోజనం చేయడం చూపరులను ఆకర్షించింది. ఇంటి నుంచి తెచ్చుకున్న ఆహార పదార్థాలను ఎనలేని సంతోషంతో వరుసగా కూర్చుని వారే వడ్డించుకుని తిన్నారు. బీచ్‌రోడ్డులోని రామానాయుడు స్టూడియో సమీపంలో కనిపించిన ఈ దృశ్యం చూపరులను ఆకట్టుకుంది.



రామానాయుడు స్టూడియో వద్ద కాలిబాటపై ఇలా..

సింహగిరిపై మద్యపానం కలకలం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరిపై జరుగుతున్న పెళ్లిళ్లలో పెళ్లి బృందాల సభ్యులు మద్యపానం చేస్తున్నారన్న విమర్శలు కలకలం రేపుతున్నాయి. పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కావడంతో సింహగిరిపై అధిక సంఖ్యలో వివాహాలు జరుగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పెళ్లి బృందాల సభ్యులు దేవస్థానం సత్రాలు, హిల్‌టాప్ రహదారి ప్రాంతాల్లో మద్యం తాగుతున్నారని పలువురు భక్తులు ఆందోళన వ్యక్తం చేశారు. సింహగిరిపై మద్యం వినియోగాన్ని నియంత్రించడంలో దేవస్థానం విఫలమవుతోందని హిందూ సంఘాల ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెళ్లి బృందాలు, సత్రాలపై గట్టి నిఘా ఉంచి మద్యం వినియోగాన్ని నిరోధించాలని కోరుతున్నారు.

విద్యార్థుల ప్రతిభ



కలెక్టరు నుంచి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థినులు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-2047 అనే అంశంపై ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి వక్తృత్వ పోటీల్లో చిట్టివలస బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలకు ద్వితీయస్థానం దక్కింది. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులు సుస్మిత, ప్రీతి జిల్లా కలెక్టరు హరేంధిర ప్రసాద్ చేతులమీదుగా ప్రశంసాపత్రాలు, పతకాలు అందుకున్నారు. వీరిని ఎంఈవోలు శివరాణి, జయప్రద, పాఠశాల హెచ్ఎం రోజామణి, తదితరులు సోమవారం అభినందించారు.

ఆనందపురం, న్యూస్‌టుడే: మండలంలోని శిర్లపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఖోఖో క్రీడా పోటీల్లో రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బుత్తల సత్యం తెలిపారు. ఈ నెల 27వ తేదీన చిత్తూరు జిల్లా కాణిపాకంలో జరగనున్న పోటీలకు పాఠశాలకు చెందిన రేవతి, పోతుల వాగ్దేవి అండర్-17 విభాగంలో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా వారిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఉద్యోగి ఆత్మహత్య



భీమునిపట్నం, న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యలతోపాటు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు భీమిలి పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా..భీమిలి గొల్లవీధిలో నివాసం ఉంటున్న **శీల అనంత పద్మనాభరావు** (56) గాజువాక తహసీల్దారు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు భార్య, కుమార్తె ఉన్నారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఈయన ఈనెల 19వ తేదీన ఇంట్లో చరవాణి వదిలిపెట్టి కోర్టు పని మీద గాజువాక వెళ్తున్నట్లు చెప్పారు. సాయంత్రం తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. సోమవారం తెల్లవారుజామున భీమిలి బీచ్‌రోడ్డు కొబ్బరి చెట్ల పార్కులో కొన ఊపిరితో ఉన్న ఈయనను గస్తీ పోలీసులు గమనించి భీమిలి సీహెచ్‌సీలో చేర్పించినా ఫలితం లేకపోయింది. భార్య ఫిర్యాదు మేరకు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎ.ఎస్.ఐ. సత్తిబాబు పేర్కొన్నారు.

జిల్లాలోని 29 సాగునీటి సంఘాలకు ఎన్నికలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలోని 29 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ హరేంధిరప్రసాద్ సోమవారం ఎన్నిక నోటిఫికేషన్ విడుదల చేశారని చెప్పారు. 40 రోజుల పాటు ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుందని, ఆయా సాగునీటి ఆయకట్టు పరిధిలోని రైతులు సభ్యులుగా ఉంటారని చెప్పారు. నవంబరు 21 నుంచి 23 వరకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈలోపు ఓటరు జాబితాల తయారీ, ప్రాదేశిక నియోజకవర్గాల ఏర్పాటు తదితర ప్రక్రియలను పూర్తి చేస్తామన్నారు. చివరిసారిగా 2015లో ఎన్నికలు జరిగాయని, తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కాగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని జేసీ వివరించారు.



మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

సమాజసేవలో పోలీసుల పాత్ర కీలకం

కొమ్మాది, న్యూస్‌టుడే: శాంతి భద్రతల పరిరక్షణలో, సంఘ విద్రోహశక్తుల నుంచి సమాజాన్ని కాపాడడంలో పోలీసులపాత్ర మరువరానిదని ఏపీఎస్పీ 16వ బెటాలియన్ కమాండెంట్ కె.వి.మురళీకృష్ణ అన్నారు. బక్కన్నపాలెం ఏపీఎస్పీ 16వబెటాలియన్‌లో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గత అక్టోబరు నుంచి ఇప్పటి వరకు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల పేర్లు చదివి వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ నివాళులర్పించారు. జీవీఎంసీ జోన్-2 కమిషనర్ పి.సింహాచలం, బిట్స్ వైజాగ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ పూర్ణసత్యనారాయణ, బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బెటాలియన్‌లో పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తున్న కమాండెంట్ మురళీకృష్ణ తదితరులు

విజయోత్సాహం

కొమ్మాది, న్యూస్‌టుడే: యువత దేశానికి సేవ చేయాలనే లక్ష్యంతో తన సొంత నిధులతో త్రివిధ దళాల్లో కొలువులు సాధించేలా యువతకు శిక్షణ అందిస్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు మాజీ ఆర్మీ ఉద్యోగి జగన్మోహన్‌రావు. ఈయన కొమ్మాది మాస్టర్‌ప్లాన్ రహదారి గాంధీనగర్ వెనుక ఉన్న క్రీడామైదానంలో జేవై ఫ్రీ డిఫెన్స్ అకాడమీ స్థాపించి యువతకు ఉచితంగా శిక్షణ అందిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన అగ్నిపథ్ (ఆర్మీ) ఎంపిక ప్రక్రియలో ఇక్కడ శిక్షణ పొందిన యువత 139 మంది ఆర్మీలో ఉద్యోగాలు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. దేశ సేవకు సిద్ధమయ్యే యువతకు ఇక్కడ ఉచితంగా శిక్షణ అందిస్తున్నామని, దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం నిర్వహించిన విజయోత్సవంలో పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ సీఐ జి.బాలకృష్ణ, ఎస్ఆర్ డెవలపర్స్ నిర్వాహకులు కె.సీతామహాలక్ష్మీ, వంకాయల మారుతీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతలను, విశ్రాంత సైనికుడు జగన్మోహన్‌రావును అతిథులు అభినందించారు.



ఆర్మీలో ఉద్యోగాలు పొందిన వారితో జేవై అకాడమీ నిర్వాహకులు

ఎర్రమట్టి దిబ్బలను పరిరక్షించాలని ముఖ్యమంత్రికి లేఖ

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: అరుదైన, చారిత్రక వారసత్వ సంపదైన భీమిలి ఎర్రమట్టి దిబ్బలను రాష్ట్ర ప్రభుత్వం పరిరక్షించాలని కోరుతూ విశ్రాంత ఐఏఎస్ అధికారి శర్మ సీఎం చంద్రబాబునాయుడుకు లేఖ రాశారు. సుందరమైన ఎర్రమట్టి దిబ్బలకు రక్షణ లేకుండా పోయిందని, ఫలితంగా అవి క్రమంగా క్షీణిస్తూ వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో వాటిని కాపాడి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అదే విధంగా తొట్లకొండ, బావికొండ బౌద్ధారామాల ప్రదేశాన్ని కూడా పరిక్షించాలని కోరారు. విశాఖ నగరంలో ఎన్నో సహజ సుందరమైన ప్రదేశాలు ఉన్నాయని, వీటి పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించాలని ఆయన ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.

విశాఖ తూర్పు

యూసీడీ ఏపీడీగా రాము బాధ్యతల స్వీకరణ



ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : జీవీఎంసీ జోన్-3 యూసీడీ విభాగం ఏపీడీగా ఎల్.రాము నియమితులు కాగా, ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గాజువాక యూసీడీ ఏపీడీగా ఉన్న ఆయన బదిలీపై జోన్-3కి వచ్చారు. ఇక్కడ పనిచేసిన దుర్గాప్రసాద్‌కు గాజువాక బదిలీ అయ్యింది. ఏపీడీ రాము జెడ్సీ శివప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అర్హులైన మహిళలందరూ పొదుపు సంఘాల్లో విధిగా చేరేలా చూడాలని జెడ్సీ శివప్రసాద్ సూచించారు.

ఉల్లి, టమోటాకు తగ్గని డిమాండ్

క్యూఆర్ కోడ్‌తో తగ్గిన వంటనూనెల అమ్మకాలు

న్యూస్‌టుడే, ఉషోదయకూడలి (ఎంవీపీకాలనీ)

బహిరంగ మార్కెట్లో ధరలు ఆకాశాన్ని తాకుతున్న సమయంలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో తగ్గింపు ధరలకు అందిస్తున్న ఉల్లి, టమోటాలకు ఆదరణ తగ్గలేదు. నిత్యం వినియోగదారులు బారులు తీరి కనిపిస్తున్నారు. వంట నూనెల తగ్గింపు ధరలకు అందించేందుకు ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ విధానంతో అమ్మకాలు తగ్గుముఖం పట్టాయి. నియోజకవర్గంలో ఎంవీపీ కాలనీ, పెదవాల్తేరు రైతుబజార్లలో ఉల్లి, టమోటాలకు గిరాకీ ఉండగా, వంటనూనెలకు మాత్రం ఆదరణ తగ్గిందనే చెప్పాలి.



నూనెల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ వద్ద కానరాని రద్దీ

ఉల్లిపాయలు, టమోటాల ధరలు ఇటీవల కాలంలో విపరీతంగా పెరిగాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు తగ్గింపు ధరలకు అందించాలనే ఉద్దేశంతో రాయితీపై ఉల్లి, టమోటాలను రైతుబజార్లలో విక్రయం మొదలు పెట్టారు. బహిరంగ మార్కెట్లో టమోటా, ఉల్లిపాయలు కిలో రూ.100కు చేరాయి. దీంతో టమోటాను కిలో రూ.50కి రైతుబజార్ల ద్వారా విక్రయించారు. దీంతో వినియోగదారుల నుంచి విశేష ఆదరణ లభించింది.

★ హోల్‌సేల్ మార్కెట్లో ధరలు తగ్గుముఖం పట్టడంతో రాయితీపై కాకుండా లాభం లేకుండా వచ్చిన ధరకే ఉల్లి, టమోటాలను ప్రస్తుతం రైతుబజార్లలో విక్రయిస్తున్నారు. బహిరంగ మార్కెట్లో ఉల్లి, టమోటాలు కిలో రూ.70 వరకు పలుకుతున్నాయి. రైతుబజార్లలో కర్నూలు ఉల్లి కిలో రూ.40, మహారాష్ట్ర ఉల్లి రూ.53 చొప్పున విక్రయిస్తున్నారు. దీంతో బయట కన్నా తక్కువ ధరలు కావటంతో వినియోగదారులు బారులు తీరి కొనుగోలు చేస్తున్నారు.

★ వంటనూనెల ధరలను అదుపులోకి తీసుకువచ్చేందుకు రిఫండాయిల్, పామాయిల్ వంట నూనెలు కూడా తగ్గింపు ధరలకు విక్రయించారు. గతంలో అన్ని బ్రాండ్‌లను అందుబాటులోకి తీసుకురాగా, ప్రస్తుతం ఒకటి రెండు బ్రాండ్‌లకే పరిమితమయ్యారు. దీంతో పాటు అమ్మకాలకు సంబంధించి క్యూఆర్ కోడ్ విధానాన్ని ప్రవేశపెట్టారు. అమ్మకాల విషయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఈ నిర్ణయం తీసుకున్నారు. వినియోగదారులు తమ ఫోన్‌లో క్యూఆర్ కోడ్‌తో స్కానింగ్ చేసిన తర్వాత నూనెలను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం రిఫండాయిల్ ప్యాకెట్ రూ.124కు, పామాయిల్ ప్యాకెట్ రూ.110కు అమ్ముతున్నారు.



ఉల్లి కోసం బారులు తీరిన వినియోగదారులు

నెలకు ఒక ప్యాకెట్ మాత్రమే...

★ క్యూఆర్ కోడ్‌తో స్కానింగ్ చేసిన తర్వాత రైస్‌కార్డు నెంబరును పొందుపరచాల్సి ఉంటుంది. ఒకసారి రిజిస్టర్ అయిన తర్వాత నెలకు రిఫండాయిల్ ఒక్క ప్యాకెట్ మాత్రమే విక్రయిస్తున్నారు. ఇక పామాయిల్ మాత్రం 3 ప్యాకెట్ల వరకు ఇస్తున్నారు. నెలకు ఒక ప్యాకెట్ అనే సరికి ఎవరూ ముందుకు రావటం లేదు. దీంతో పాటు పేరొందిన బ్రాండ్‌లు లేకపోవటం కూడా ఆసక్తి చూపటం లేదు. దీంతో రిఫండాయిల్ అమ్మకాలు ఒక్కసారిగా తగ్గుముఖం పట్టాయి. రోజుకు 20 నుంచి 25 ప్యాకెట్లు మాత్రమే అమ్ముడవుతున్నాయి. పామాయిల్ మాదిరిగా రిఫండాయిల్ కూడా మూడు ప్యాకెట్లు విక్రయించాలని పలువురు కోరుతున్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న సి.ఐ జె.మురళి

బహిరంగంగా మద్యం తాగితే చర్యలు తప్పవు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పెదజాలారిపేట తీరంలో కొందరు బహిరంగంగా మద్యం తాగుతున్నారన్న సమాచారం మేరకు ఎంవీపీ స్టేషన్ సి.ఐ. జె.మురళి సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM

ఎంవీపీకాలనీ 80085 74768 మద్దిలపాలెం 99121 20229

న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

సమస్య : పెదవాల్తేరు గాంధీ కూడలిలో 15/బి/4 పోల్‌పై వీధి దీపాలు వెలగటం లేదు
– రామారావు

సమాధానం: పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం – విక్రాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్

సమస్య : ఉషోదయకూడలి నుంచి బీచ్‌రోడ్డుకు వెళ్లే మార్గం పాడైపోయింది
– రాజేంద్రప్రసాద్

సమాధానం: ప్రస్తుతం ప్రతిపాదనలు చేస్తున్నాం. టెండర్ల ప్రక్రియ పూర్తైన తర్వాత పనులు చేపడతాం
– వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్యే

కాలుష్య నియంత్రణకు కృషి చేయాలి

శివాజీపాలెం, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే : ప్రతీ ఒక్కరూ కాలుష్య నియంత్రణకు కృషి చేయాలని గ్రీన్ క్లైమేట్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం అన్నారు. సోమవారం శివాజీపాలెంలో ఉన్న జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో గ్రీన్‌క్లైమేట్ సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణ హితంగా దివ్వెల పండగ చేద్దామని చిన్నారులను కోరారు. కార్యక్రమంలో భాగంగా ప్లకార్డులు చేతపట్టి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న చిన్నారులు

మునగ ఆకుల్లో పోషక విలువలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఎన్నో పోషక విలువలు కలిగి ఆరోగ్యాన్నిచ్చే మునగ ఆకుల ప్రయోజనాలను తెలుపుతూ ఐసీడీఎస్ విభాగం గోడపత్రిక రూపొందించింది. సోమవారం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిరప్రసాద్ కలెక్టరేట్‌లో గోడపత్రిక విడుదల చేశారు. ఐరన్, ప్రొటీన్, విటమిన్ ఎ,సి,ఇ, విటమిన్ బీ1,బీ2,బీ6 వీటి ద్వారా లభిస్తాయన్నారు. జేసీ మయూర్ అశోక్, డీఆర్వో మోహన్‌కుమార్, ఐసీడీఎస్ పథక సంచాలకులు జయదేవి, డీఈఓ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

అవీ ఇవీ

● డీఎస్సీకి ఉచిత శిక్షణ

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌కు హాజరవుతున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ డి.డి. రామారావు తెలిపారు. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. అభ్యర్థులు mdfc.apcfss.in, janabhumi.ap.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తుకు ఈనెల 25 వరకు గడువు పెంచినట్లు కోరారు. ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే ఈ అవకాశమని, టెట్‌లో అర్హత కలిగి ఉండాలని సూచించారు.

● నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

శివాజీపాలెం, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే : మంగాపురంకాలనీ 11కేవీ విద్యుత్తు ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-1 ఇ.ఇ బి.సింహాచలంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మంగాపురం కాలనీ, శివాజీపాలెం, ఎస్.ఎస్.టి.పాఠశాల, తారామసీదు పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

● పిల్లలకు పోలియో టీకాలు వేయాలి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : పోలియో ఒక అంటువ్యాధని, ప్రధానంగా ఐదు సంవత్సరాల లోపు పిల్లలపై ప్రభావితం చూపుతుందని డాక్టర్ సతీష్‌కుమార్ అన్నారు. సిరిపురంలోని ఓ హోటల్లో సోమవారం ఉదయం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. . పోలియో నియంత్రణ జరిగిందన్న ధీమాగా ఉన్న సమయంలో మేఘాలయలో పోలియో కేసు బయట పడిందన్నారు. 24న ప్రపంచ పోలియో దినోత్సవం పురస్కరించుకొని పిల్లలకు టీకాలు వేయించాలని కోరారు.

● ఆర్థిక అక్షరాస్యత పెరగాలి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : మ్యూచువల్ ఫండ్స్‌పై ప్రజల్లో ఆర్థిక అక్షరాస్యత పెరగాల్సి ఉందని ఎం.ఎఫ్.ఎ.ఐ సీఈవో చలసాని వెంకట నాగేశ్వర్ అన్నారు. బీచ్‌రోడ్డు పార్కుహోటల్లో సోమవారం ఉదయం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ పెట్టుబడిదారుల మహోత్సవాలు పురస్కరించుకొని పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మ్యూచువల్ ఫండ్స్ దేశంలో ప్రవేశించి 60 సంవత్సరాలు దాటినా ఇప్పటి వరకు ఇతర దేశాలతో పోల్చితే ఆశించిన అభివృద్ధి చెందలేదన్నారు.

● గంజాయి. డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపాలి

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : ఆరిలోవ పోలీస్‌స్టేషన్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన మల్లేశ్వరరావును ఆరిలోవ ప్రాంత తెదేపా నేతలు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆరిలోవ పోలీస్‌స్టేషన్ పరిధిలో అసాంఘిక చర్యలకు అడ్డుకట్ట వేయాలన్నారు. మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు, బుడుమూరి గోవింద్, ముగడ రాజారావు, ఒమ్మి పోలరావు, లింగం సత్యనారాయణ, తదితరులు సీఐను కలిసిన వారిలో ఉన్నారు.

ప్రతిభ చూపారు.. బహుమతులు పొందారు..

'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న భారతి ఆంగ్ల మాధ్యమ పాఠశాల విద్యార్థులు



విజేతలైన భారతి ఆంగ్ల మాధ్యమ పాఠశాల విద్యార్థులు యు.భానుప్రవీణ, పి.ఉషారాణి, ఎం.వసంత సాహితిలకు బహుమతులందిస్తున్న దృశ్యం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : ఆరిలోవ టీఐసీ పాయింట్ వద్ద విద్యానగర్‌లో గల భారతి ఆంగ్ల మాధ్యమ పాఠశాల, శ్రీవిజేత స్కూల్‌లో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'అంతర్జాల వినియోగంలో లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అన్న అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఒక్కో పాఠశాలలో ముగ్గురు చొప్పున ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విజేతలుగా ఎంపిక చేశారు. భారతి ఆంగ్లమాధ్యమ పాఠశాలలో యు.భాను ప్రవీణ (పదో తరగతి), పి.ఉషారాణి (ఎనిమిదో తరగతి), ఎం.వసంత సాహితి(పదోతరగతి) మొదటి మూడుస్థానాల్లో నిలిచారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంవీ రావు, ఉపాధ్యాయులు అఖిల, పుష్పరాణి, ఉషా తదితరుల చేతుల మీదుగా బహుమతులు అందించారు. అలాగే శ్రీ విజేత స్కూల్‌లో ఎస్.గ్రీష్మ (తొమ్మిదో తరగతి), బి.రేణుక సూర్య (పదో తరగతి), బి.మోహన లక్ష్మీ(పదో తరగతి) మొదటి మూడుస్థానాల్లో నిలవగా ప్రధానోపాధ్యాయిని వై.రేఖ చేతుల మీదుగా బహుమతులందించారు.



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న శ్రీవిజేత స్కూల్ విద్యార్థులు



విజేతలైన శ్రీవిజేత స్కూల్ విద్యార్థులు ఎస్.గ్రీష్మ, బి.రేణుక సూర్య, బి.మోహనలక్ష్మిలకు బహుమతులందిస్తున్న దృశ్యం

వినతుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ఎమ్మెల్యే కార్యాలయానికి వచ్చిన వినతుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని పలు విభాగాల అధికారులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదేశించారు. సోమవారం ఆయన కార్యాలయంలో ఉంటూ నియోజకవర్గ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలు విన్న ఆయన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలు పరిష్కరించేందుకు ఆలస్యం చేయవద్దని సూచించారు. కొన్ని సమస్యలను జెడ్సీ దృష్టికి తీసుకువెళ్లారు. పలువురు బాధితులు తమ అర్జీలను సమర్పించారు.



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

రూ.10 నాణెంపై అపోహలు వద్దు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ఆర్.బి.ఐ. విడుదల చేసిన రూ.10నాణెం తీసుకునేందుకు చాలామంది వెనకాడుతున్నారని.. వీటి వినియోగంలో ఎలాంటి సందేహాలు పెట్టుకోవద్దని బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. సోమవారం ఉదయం ఎంవీపీకాలనీ రైతుబజారులో రూ.10నాణెంపై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. వినియోగదారులు ఇస్తే తీసుకుని వారికి అవసరమైన సరకులు ఇవ్వాలని, అంతేకానీ రూ.10నాణెం తీసుకోమని చెప్పవద్దన్నారు. వినియోగదారులకు కూడా ఈ నాణేలపై అవగాహన కల్పించారు. ఎస్టేట్ అధికారి ప్రసాద్, సహాయకుడు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

ఉచితంగా భగవద్గీత పుస్తకాల పంపిణీ

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : తి.తి.దే., హిందు ధర్మప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో భగవద్గీత పుస్తకాలను స్కూలు విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. భగవద్గీత గ్రంథం ప్రాముఖ్యతను వివరించారు. ప్రతీ ఒక్కరూ ఈ పుస్తకాలను చదివి అందులో సారాంశాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. పర్యవేక్షకులు క్రాంతికుమార్, ప్రోగ్రాం అసిస్టెంట్ సత్యనారాయణ, మండలి ప్రతినిధులు సత్యనారాయణ, రాజారావు, కనకరాజు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.



భగవద్గీత పుస్తకాలతో విద్యార్థులు

వైద్య శిబిరానికి స్పందన

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఏయూ హ్యూమన్ జెనిటిక్స్ విభాగం, ఫుడ్ న్యూట్రిషన్ అండ్ డైటిక్స్ విభాగం సంయుక్తం ఆధ్వర్యంలో ఇండస్ ఆసుపత్రి సహకారంతో ఉచితంగా ఎముక సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏయూ రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్‌బాబు ప్రారంభించి ఆయన కూడా పరీక్ష చేయించుకున్నారు. డాక్టర్ పడాల శ్రీకాంత్ వైద్య పరీక్షలు చేసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో భాగంగా ఫుడ్, న్యూట్రిషన్ అండ్ డైటిక్స్ విభాగం ఫుడ్‌స్టాల్స్‌ను ఏర్పాటు చేసింది. ఏయూ హ్యూమన్ జెనిటిక్స్ విభాగాధిపతి డాక్టర్ వి.లక్ష్మి, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని సందర్శించిన రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్‌బాబు

యువత వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలి

ఆటోమోటివ్, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే : యువత వ్యక్తిత్వ వికాసంతో పాటు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రిసోర్సు పర్సన్ ఎస్.ఎ.బాబు అన్నారు. సోమవారం ఇసుకతోట ప్రాంతంలో ఉన్న శ్రీబాసర జూనియర్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, యువజన సర్వీసులశాఖ, సెట్విస్ సంయుక్త ఆధ్వర్యంలో వ్యక్తిత్వవికాసం, వృత్తినైపుణ్యత, యూత్ క్లబ్‌లపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఆంగ్లభాష, నైపుణ్యతపై పట్టుసాధించాలని కోరారు. సమాజ అభివృద్ధికి యూత్ క్లబ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యువజన సర్వీసులశాఖ, కళాశాల అధ్యాపకులు పలువురు పాల్గొన్నారు.



వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పిస్తున్న బాబు

బాల కార్మికులను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో బాల కార్మికులను గుర్తించేందుకు నెలరోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ టాస్క్‌ఫోర్సు కమిటీ సభ్యులు, కార్మికశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలోని అన్ని పరిశ్రమలు, ప్రైవేటు వ్యాపార సంస్థలు, దుకాణాలను తనిఖీ చేసి అక్కడ పనిచేసే వారి వివరాలను సేకరించాలన్నారు. 14ఏళ్ల లోపు బాలలు ఎక్కడా పనిచేయడానికి వీలు లేదన్నారు. 15 నుంచి 18ఏళ్ల పిల్లలు ప్రమాద రహిత సంస్థల్లో మాత్రమే పనిచేయడానికి అవకాశం ఉందన్నారు. కార్మికశాఖ ఉప కమిషనర్ సునీత, డీఆర్వో మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

★ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి, సురక్ష బీమా యోజన పథకాల ప్రయోజనాలను ప్రజలకు తెలియజేసి, వాటిల్లో ఎక్కువ మంది చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. వచ్చే ఏడాది జనవరి 15 వరకు వీటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

వాన కురిస్తే చింతే..



వాననీటిని పట్టేందుకు బకెట్ ఏర్పాటు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : వర్షం కురిస్తే ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రిలో వర్షపు నీరు స్లాబ్ లీకుల నుంచి లోపలికి వస్తోంది. ఇటీవల కురిసిన వర్షానికి ఇదే పరిస్థితి ఎదురైంది. దీంతో కార్యాలయంలోని పలు గదులు తడిచి ముద్దయ్యాయి. ఆ ప్రాంతాలన్ని చిత్తడిగా మారుతున్నాయి. ప్లాస్టిక్ డబ్బాలు పెట్టి వర్షపు నీరు పట్టాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని లీకులను అరికట్టేందుకు శాశ్వత చర్యలు చేపట్టాల్సి ఉంది.



గోడమీద లీకులు

కమనీయం.. నరహరి నిత్యకల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య కల్యాణోత్సవం సోమవారం సింహగిరిపై కమనీయంగా జరిగింది. అర్చకులు దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని శోభాయమానంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళ వాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయ వేడుకను జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.



విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు

ఏయూని సందర్శించిన జి.ఎం.ఆర్. ఫౌండేషన్ డైరెక్టర్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని జి.ఎం.ఆర్.వరలక్ష్మి ఫౌండేషన్ డైరెక్టర్ స్మిత్ రాజు సందర్శించి ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావుతో సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా యువతకు నైపుణ్యాలను పెంపొందిస్తూ మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించే కోర్సుల రూపకల్పనపై చర్చించారు. డ్యూయల్ డిగ్రీ విధానాన్ని ఏయూలో అమలు చేస్తున్నామని, దీని ప్రాధాన్యత, యువతకు లాభదాయకంగా నిలిచే విధానం తదితర అంశాలను వీసీ వివరించారు. ఏయూలో ఏర్పాటు చేసిన ఆ హబ్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, మైటీ సీఓఈలను ఆమె సందర్శించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్‌బాబు, ఆహబ్ సీఈఓ రవి ఈశ్వరప్ప, పూజ విద్యాశంకర్, ప్లేస్‌మెంట్ అధికారులు డాక్టర్ చల్ల నరసింహం, వి.ఆర్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జి.ఎం.ఆర్. వరలక్ష్మి ఫౌండేషన్ డైరెక్టర్ స్మిత్ రాజును సత్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, తదితరులు

ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనను సద్వినియోగం చేసుకోవాలి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ఇంటి పైకప్పుపై సోలార్ యూనిట్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కోరారు. సోమవారం ఆయన కార్యాలయంలో ఏపీఈపీడీసీఎల్ అధికారుల ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకానికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ పథకం గృహ వినియోగదారులకు మాత్రమే వర్తింపచేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఈఈ సింహాచలంనాయుడు, డి.ఈ.ఈ. సుమన్, ఎ.ఈ.ఈ. సురేష్‌లు పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే వెలగపూడి

రాకపోకలకు మార్గం సుగమం చేయండి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : వెంకోజీపాలెం కొండవాలు ప్రాంతాల్లో స్థిరనివాసం ఉన్న వారికి రాకపోకలకు మార్గం విషయంలో సమస్య తలెత్తింది. జాతీయ రహదారికి ఆనుకుని సీఎంఆర్ ఫంక్షన్‌హాలు ఎదురుగా సింహాచలం దేవస్థానం ప్రహరీ నిర్మిస్తోంది. ముందు ముందు ఆక్రమణలకు తావు లేకుండా ప్రహరీ నిర్మిస్తోంది. అయితే సీఎంఆర్ ఫంక్షన్‌హాలు ఎదురుగా కొండపై ఉన్న సుమారు 100 మంది రాకపోకలకు వీలుగా మెట్ల మార్గం ఉంది. ఈ మెట్ల మార్గాన్ని గతంలో జీవీఎంసీ నిర్మించింది. అయితే ప్రస్తుతం ఈ ప్రహరీ నిర్మాణంలో భాగంగా మెట్ల మార్గం మీదుగా నిర్మాణాలను చేపడుతున్నారు. దీంతో స్థానికంగా ఉన్న వారంతా ఎమ్మెల్యే వెలగపూడి దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లారు. దీంతో ఆయన సింహాచలం దేవస్థానం అధికారులతో చర్చించి న్యాయం చేస్తానని హామీఇచ్చారు. ఇక్కడ మెట్ల మార్గం మూసివేస్తే సుమారు 100 నివాసాల వారికి మార్గం లేక ఇబ్బందులు తప్పవని స్థానికులు చెబుతున్నారు. మరి అధికారులు ఏమి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.



మెట్ల మార్గంలో ప్రహరీ నిర్మాణం

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం



దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్

తహసీల్దార్‌కు వినతులు

గురుద్వారా, న్యూస్‌టుడే: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. తహసీల్దార్ రమేశ్ అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించి పరిశీలించారు. ప్యామిలీ సభ్యత్వం పత్రాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తులు చేసుకున్నారు. వాటిని పరిశీలించి వెంటనే మంజూరయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

అ వీ ఇ వీ

■ 25న నిరుద్యోగ యువతకు ఉద్యోగ మేళా

కంచరపాలెం, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు ఈనెల 25న ఉదయం పది గంటలకు స్థానిక నేషనల్ కెరీర్ సర్వీసు సెంటర్‌లో ఉద్యోగ మేళా జరగనున్నట్లు సబ్ రీజనల్ ఎంప్లాయిమెంటు అధికారి ఎస్.శ్యామ్‌సుందర్ తెలిపారు. ముత్తుట్ మైక్రోఫిన్ లిమిటెడ్, సర్గ్రహ గ్రూప్ ఆఫ్ కంపెనీల్లో 150 ఖాళీలకు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారు విశాఖతో పాటు విజయనగరం, శ్రీకాకుళం, పశ్చిమగోదావరి జిల్లాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు.

■ అన్న సమారాధన

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: రామకృష్ణానగర్ సమీపంలోని రజకవీధిలో శ్రీమాదుర్గా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. స్థానిక నాయకులు పోతు సత్యనారాయణ అన్న ప్రసాద వితరణను ప్రారంభించారు. కమిటీ సభ్యులు చిన్న, వెంకటరావు, అప్పలరాజు, బాబీ తదితరులు పాల్గొన్నారు.

■ ఆధార్ నవీకరణకు రూ.50 సర్వీసు ఛార్జీ

మురళీనగర్, న్యూస్‌టుడే: జంకులకాలనీలో వాసు కాలనీ, బృందావన్ పార్కు, సచివాలయాల్లో ఈనెల 22నుంచి 25వరకు ఆధార్ క్యాంప్ ప్రత్యేక సేవలు నిర్వహించనున్నారు. దీనికై రూ.50లు సర్వీసు ఛార్జీగా చెల్లించాల్సి ఉంటుందని బృందావన్ పార్కు సచివాలయ కార్యదర్శి నరేంద్ర పేర్కొన్నారు. జంకులకాలనీవాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సచివాలయ పనివేళల్లోనే ఈ సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

■ విష్ణుకుమార్‌రాజుకు పరామర్శ

గురుద్వారా, న్యూస్‌టుడే: కాలికి గాయమై ఇంట్లో ఉంటున్న ఉత్తర నియోజకవర్గం శాసన సభ్యులు పి.విష్ణుకుమార్‌రాజును భీమిలి శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు సోమవారం పరామర్శించారు. ప్రస్తుత పరిస్థితులపై కాసేపు ముచ్చటించారు. ఆయన వెంట కోరాడ రాజబాబు ఉన్నారు.



విష్ణుకుమార్‌రాజుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

■ యూసీడీ ఏపీడీగా రాము బాధ్యతలు స్వీకరణ

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : జీవీఎంసీ జోన్-3 యూసీడీ విభాగం ఏపీడీగా ఎల్.రాము నియమితులు కాగా, ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గాజువాక యూసీడీ ఏపీడీగా ఉన్న ఆయన బదిలీపై జోన్-3కి వచ్చారు. ఇక్కడ పనిచేసిన దుర్గాప్రసాద్‌కు గాజువాక బదిలీ అయ్యింది. ఏపీడీ రాము జెడ్సీ శివప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ఆధార్ నవీకరణకు మరో అవకాశం

నేటి నుంచి ప్రత్యేక శిబిరాలు

మాధవధార, న్యూస్‌టుడే

ఆధార్ నవీకరణకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. నేటి నుంచి 25 వరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలియజేశారు. తరచూ ఆధార్‌కు నవీకరణ, మార్పులకు సంబంధించి జనం మీ-సేవ కేంద్రాలు, సచివాలయాల చుట్టూ తిరుగుతుంటారు. అన్నిచోట్ల ఇవి అందుబాటులో లేకపోవడంతో పొందేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా వివిధ పథకాలు పొందేందుకు వీటికి ఆధార్ ప్రామాణికం కానున్నది. దీంతో మూడు రోజులపాటు వార్డు సచివాలయాల్లోనే ఆధార్ నవీకరణకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు.

★ ప్రతి పదేళ్లకోసారి ఆధార్‌ను నవీకరణ చేసుకోవాల్సి ఉంటుంది. దీనిలో భాగంగా వేలిముద్రలు, కంటిపాప (ఐరిస్) నమోదు చేస్తారు. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి నవీకరణ చేయనున్నారు. ముఖ్యంగా చిన్నారులు, విద్యార్థులు, వృద్ధులకు ఇది ఎంతో అవసరం. చాలా వరకు వేలిముద్రలు అరిగిపోవటం, కళ్లు సరిగా స్కానింగ్ జరగక పోవటంతో అనేక మంది ప్రభుత్వ పథకాలను పొందలేకపోతున్నారు. వీటితో పాటుగా పలువురు చిరునామాలు మారిపోవటం, వలసలు వెళ్లిపోవటంతో ఆయా ప్రాంతాల్లో వారు స్థిర నివాసం అనిపించుకునేందుకు తాజా చిరునామాతో ఆధార్‌ను మార్చుకోవాల్సి వస్తోంది. ఉత్తర నియోజకవర్గంలో ఇతర ప్రాంతాల నుంచి అనేక మంది వలసలు వచ్చి స్థిరపడటంతో పాటు, సరైన అవగాహన లేక అనేక తప్పులు గతంలో దొర్లాయి. ఇటువంటి సమస్యలను సరి చేసుకునేందుకు ఇదో మంచి అవకాశం.



గతంలో సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ సేవలు

నియోజకవర్గంలో ఇలా..

నియోజకవర్గంలో మొత్తం 60 సచివాలయాల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆధార్ నవీకరణ చేసేలా చర్యలు తీసుకున్నారు. కొత్తగా పేర్ల నమోదు, చిరునామాల్లో మార్పులు, చేర్పులు, ఫోన్ నెంబర్ల సవరణ, బయోమెట్రిక్ వంటి వాటికి అవకాశం కల్పిస్తున్నారు.

అల్లిపురం, న్యూస్‌టుడే

సమస్య: 34వ వార్డు కొబ్బరితోట, అచ్చియమ్మపేట తదితర ప్రాంతాల్లో తక్కువ సమయం మంచి నీటిని సరఫరా చేస్తున్నారు. సరఫరా సమయం పెంచాలి.

– సత్తిరాజు, కొబ్బరితోట

సమాధానం: మీ ప్రాంతంలో క్షేత్ర స్థాయి పరిశీలన చేసి సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేస్తాం.

– ఎం.మల్లయ్య నాయుడు, జోన్-4 జెడ్సీ

దీపాలు వెలిగించారు

గురుద్వారా, న్యూస్‌టుడే

ఉత్తర నియోజకవర్గం 24వ వార్డులోని వీధుల్లో అంధకారం తొలగింది. గాంధీనగర్, టీటీడీకాలనీ, ఎన్ఎంసీ హైస్ పాఠశాల, శివాలయంకు వెళ్లే మార్గంలో దీపాలు వెలగక అంధకారం అలముకోవడంతో ఆ సమస్యపై ఇటీవల 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై జీవీఎంసీ అధికారులు స్పందించి దీపాలకు మరమ్మతులు నిర్వహించి వెలిగేలా చర్యలు తీసుకున్నారు.



ఈనాడు కథనానికి స్పందన

రూ.10 నాణెంపై అపోహలు వద్దు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ఆర్.బి.ఐ. విడుదల చేసిన రూ.10 నాణెం తీసుకునేందుకు చాలామంది వెనకాడుతున్నారని.. వీటి వినియోగంలో ఎలాంటి సందేహాలు పెట్టుకోవద్దని బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. సోమవారం ఉదయం ఎంవీపీ కాలనీ రైతుబజారులో రూ.10నాణెంపై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. వినియోగదారులు ఇస్తే తీసుకుని వారికి అవసరమైన సరకులు ఇవ్వాలని, అంతేకాని రూ.10నాణెం తీసుకోమని చెప్పవద్దన్నారు. వినియోగదారులకు కూడా ఈ నాణెంపై అవగాహన కల్పించారు.

ఇదేమి చెత్త పని ?

సీతంపేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల గోడను ఆనుకుని చెత్తను డంపర్‌బిన్‌లో కాకుండా పక్కనే పడేశారు. చెత్త వేయొద్దని బ్యానర్ కట్టినా అక్కడే పడేశారు.

– సీతంపేట, న్యూస్‌టుడే



కమనీయం.. నరహరి నిత్యకల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య కల్యాణోత్సవం సోమవారం సింహగిరిపై కమనీయంగా జరిగింది. అర్చకులు దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని శోభాయమానంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయ వేడుకను జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.

బార్ దుకాణాలను తరలించండి

మురళీనగర్, న్యూస్‌టుడే : సెక్టార్-11, 48 బస్‌రూట్‌లో ఉన్న బార్ అండ్ రెస్టారెంట్‌ను వెంటనే తొలగించాలని నివాసిత సంక్షేమ సంఘ అధ్యక్షులు సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో కాలనీవాసులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలోనే పలుమార్లు నిరసనలు చేపట్టినప్పటికీ ఫలితం లేదని తెలిపారు. నివాసితులు ఉండే ఈ ప్రాంతంలో బార్లు ఏర్పాటు చేయడం వలన ఇక్కడ ప్రశాంతత కోల్పోయి అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారుతోందన్నారు. జనావాసాల మధ్య ఉన్న ఈ మద్యం దుకాణాల వలన మహిళల రక్షణ లేకుండా పోయిందన్నారు. సమీపంలోనే రామాలయం, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయని, నిత్యం విద్యార్థులు ఈ మార్గంలోనే వెళ్లాల్సి ఉందన్నారు. ఉదయం 6నుంచి రాత్రి 12 గంటల వరకు ఈ ప్రాంతంలో మందుబాబులు హడావుడితో స్థానికులతో పాటు రాకపోకలు సాగించేవారు అసౌకర్యానికి గురవుతున్నారు అన్నారు. సంబంధిత అధికారులు తక్షణమే ఈ రెండు మద్యం దుకాణాలను వేరేచోటికి తరలించాలని విజ్ఞప్తి చేశారు.

డీఎస్సీకి ఉచిత శిక్షణ

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌కు హాజరవుతున్న ఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ డి.డి. రామారావు తెలిపారు. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. అభ్యర్థులు http:///mdfc.apcfss.in, http:///janabhumi.ap.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తుకు ఈనెల 25 వరకు గడువు పెంచినట్లు కోరారు. ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే ఈ అవకాశమని, టెట్‌లో అర్హత కలిగి ఉండాలని సూచించారు.

రోలర్ స్కేటింగ్‌లో బాలిక ప్రతిభ

మురళీనగర్, న్యూస్‌టుడే : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి 20 వరకు కాకినాడ ఇంటర్నేషనల్ రింక్‌లో జరిగిన రోలర్‌స్కేటింగ్ పోటీలలో విద్య ప్రజాపతి అండర్ 14లో పతకాలు సాధించింది. బాలభాను విద్యాలయంలో చదువుతున్న విద్య ప్రెండ్స్ రోలర్ స్కేటింగ్ అకాడమీ తరఫున ఈ పోటీలో తలపడింది. 1000 మీటర్ల రింక్ రేస్‌లో స్వర్ణం, 500 మీటర్ల రేస్‌లో రజత పతకాలను కైవసం చేసుకుంది. జాతీయ రహదారి గంగానీటిడారి వుడా బహుళ అంతస్తుల సముదాయంలో నివాసం ఉంటున్న ఈమె నవంబరులో దిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ కృష్ణకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా బహుళ అంతస్తుల అధ్యక్షులు ఎ.ఎర్రయ్య ఆమెను అభినందించారు.



పతకం అందుకుంటున్న విద్య ప్రజాపతి

వెయిట్ లిఫ్టింగ్‌లో విద్యార్థి ప్రతిభ

సీతంపేట, న్యూస్‌టుడే : సర్గిపట్నం ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 20న నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థి ప్రతిభ చూపారు. ఈ పోటీల్లో జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్ విద్యార్థి ఎస్.శ్యామ్‌కుమార్ 81 కిలోలు, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 83 కిలోల విభాగాలలో చెరో బంగారు పతకం సాధించారు. అతడిని కళాశాల వర్గాలు అభినందించాయి.



బుల్లయ్య కళాశాల విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

గోతులు బాబోయ్.. గోతులు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే

ఈ మధ్య కాలంలో నగరంలో ఏ రోడ్డులో చూసినా ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారినపడి మరణించడం వింటూనే ఉన్నాం. దీనికి ప్రధాన కారణం రహదారుల మధ్యలో గోతులు ఎక్కువగా ఉండడం. ఇదే తరహాలో గంటకు వందలాది చిన్న, పెద్ద వాహన చోదకులు ప్రయాణాలు చేసే ప్రధాన రహదారులు గోతులమయంగా మారాయి.

★ దొండపర్తి శ్రీసూర్యా కూడలి నుంచి శ్రీకన్య సినిమాహాలుకు వెళ్లే రహదారంతా గోతులమయంగా తయారయ్యింది. గతంలో చిన్న గోతులుగా ఉండే ఈ దారిలో ఈ మధ్య ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గోతులు కాస్త పెద్దవిగా తయారై ప్రమాదకరంగా మారాయి. అందువల్ల ఈ దారిలో తరచూ ప్రమాదాల బారిన పడుతున్నామని కొంత మంది ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

★ శ్రీకన్య సినిమాహాలు నుంచి డైమండ్ పార్కుకు వెళ్లే దారి పొడవునా గోతులు దర్శనం ఇస్తున్నాయి. ఇవి రోజురోజుకీ పెద్దవిగా మారి ప్రమాదాలకు సంకేతాలుగా నిలుస్తున్నాయి. అటు పెందుర్తి, ఎన్.ఎ.డి., కంచరపాలెం తదితర ప్రాంతాల నుంచి వాహన చోదకులు శ్రీసూర్యా, డైమండ్ పార్కు మీదుగా జగదాంబ, డాబాగార్డెన్స్, ఆర్టీసీ ప్రాంతాలకు ఈ దారిలోనే ఎక్కువగా వెళ్తుంటారు. డైమండ్ పార్కు, ఆర్టీసీ కాంప్లెక్స్, ద్వారకానగర్ ప్రాంతాలలో ఎక్కువగా వ్యాపార సంస్థలు, బ్యాంకులు, కళాశాలలు ఉండడంతో అధికసంఖ్యలో ఈ రహదారినే వినియోగిస్తుంటారు. వెంటనే ఈ దారుల్లో ఏర్పడ్డ గోతుల్ని త్వరితగతిన పూడ్చి ప్రమాదాల బారి నుంచి ప్రయాణికుల్ని కాపాడాలని కోరుతున్నారు.



శ్రీకన్య సినిమాహాలుకు వెళ్లే దారిలో గొయ్యి



శ్రీకన్య సినిమాహాలు నుంచి శ్రీసూర్యా కూడలికి వచ్చే దారిలో గోతులు

సేవా రహదారిలో..

మాధవధార, న్యూస్‌టుడే

జాతీయ రహదారి సీతన్నగార్డెన్స్ సేవా రహదారిలో భారీ గొయ్యి ఏర్పడింది. ఈ మధ్య కురిసిన వర్షానికి అందులో నీరు నిల్వ ఉండటంతో పూర్తిగా గొయ్యిలా మారింది. నిత్యం కొన్ని వందల మంది ప్రయాణించే వాహన చోదకులు, ఆటోవాలాలకు సంబంధించిన వాహనాల టైర్లు ఈ గోతుల్లో దిగబడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో ఈ గొయ్యిని గమనించలేని చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నిరంతరం వాహనాల రాకపోకల వల్ల రోజు రోజుకి గొయ్యి పెద్దగా తయారవుతుంది. తక్షణమే ఇంజనీరింగ్ అధికారులు స్పందించి గొయ్యిని పూడ్చేలా తగు చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.




పలు రైళ్ల రీషెడ్యూల్

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: లింక్ రైళ్లు ఆలస్యంగా నడుస్తుండడంతో పలు రైళ్ల బయలు దేరే సమయాలను తాత్కాలికంగా మార్పు చేసి నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఎస్ఎంవీ బెంగళూరు-విశాఖ(08544) ప్రత్యేక రైలు ఈ నెల 21న మధ్యాహ్నం 3.50గంటలకు బదులు 4.10గంటలు ఆలస్యంగా రాత్రి 8 గంటలకు. ., హౌవ్‌డా-ఎస్ఎంవీ బెంగళూరు(12863) ఎక్స్‌ప్రెస్ ఈనెల 21వ తేదీ రాత్రి 10.50 గంటలకు బదులు 4.10గంటలు ఆలస్యంగా మర్నాడు తెల్లవారుజామున 3 గంటలకు బయలుదేరేలా మార్పు చేశారు.

ఎర్నిమాంబ ఆలయ హుండీ ఆదాయం రూ.3,86,430

అల్లిపురం, న్యూస్‌టుడే: కాన్వెంట్‌కూడలిలోని అచ్చియమ్మపేట గ్రామదేవత ఎర్నిమాంబ ఆలయ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించినట్లు ఈవో సురేష్‌బాబా తెలిపారు. నెల రోజులకు గాను రూ.3,86,430 ఆదాయం లభించిందన్నారు. దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

మునగ ఆకుల్లో పోషక విలువలు



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఎన్నో పోషక విలువలు కలిగి ఆరోగ్యాన్నిచ్చే మునగ ఆకుల ప్రయోజనాలను తెలుపుతూ ఐసీడీఎస్ విభాగం గోడపత్రిక రూపొందించింది. సోమవారం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ కలెక్టరేట్‌లో గోడపత్రిక విడుదల చేశారు. ఐరన్, ప్రొటీన్, విటమిన్ ఎ,సి,ఇ, విటమిన్ బీ1,బీ2,బీ6 వీటి ద్వారా లభిస్తాయన్నారు. జేసీ మయూర్ అశోక్, డీఆర్వో మోహన్‌కుమార్, ఐసీడీఎస్ పథక సంచాలకులు జయదేవి, డీఈఓ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలోని 29 సాగునీటి సంఘాలకు ఎన్నికలు



మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలోని 29 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ హరేంధిరప్రసాద్ సోమవారం ఎన్నిక నోటిఫికేషన్ విడుదల చేశారని చెప్పారు. 40రోజుల పాటు ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుందని, ఆయా సాగునీటి ఆయకట్టు పరిధిలోని రైతులు సభ్యులుగా ఉంటారని చెప్పారు. నవంబరు 21 నుంచి 23 వరకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈలోపు ఓటరు జాబితాల తయారీ, ప్రాదేశిక నియోజకవర్గాల ఏర్పాటు తదితర ప్రక్రియలను పూర్తి చేస్తామన్నారు. చివరిసారిగా 2015లో ఎన్నికలు జరిగాయని, తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కాగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని జేసీ వివరించారు.

ఆవేదన.. ఆందోళన..!

వన్‌టౌన్, న్యూస్‌టుడే

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలు సంఘాల సభ్యులు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు.

★ రెండు నెలల జీతాల బకాయిలు విడుదల చేయాలని, వార్షిక ఇంక్రిమెంట్లు సహా ఇతర సమస్యలను పరిష్కరించాలని 108 ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎస్.బంగార్రాజు ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన తెలిపారు.

★ నగర పరిధి భూపేష్‌నగర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన మూడు మద్యం దుకాణాలను తొలగించాలని స్థానిక మహిళలు ప్లకార్డులు చేపట్టి ఆందోళన చేశారు.. సీఐటీయూ నాయకులు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

★ 85శాతం పైగా వైకల్యం ఉన్న వారికి రూ.15వేల పింఛను ఇవ్వాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డేవిడ్‌రాజు, జిల్లా అధ్యక్షులు అక్కిరెడ్డి అప్పారావు, మహిళా విభాగ ఉపాధ్యక్షులు మల్లేశ్వరి కోరారు. ★ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు విడుదల చేయాలని సీఐటీయూ నాయకులు జి.మంగశ్రీ, పి.మణి తదితరులు నిరసన తెలిపారు.



నిరసన తెలుపుతున్న 108 ఉద్యోగులు



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మహిళలు

బాల కార్మికులను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో బాల కార్మికులను గుర్తించేందుకు నెలరోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ టాస్క్‌ఫోర్సు కమిటీ సభ్యులు, కార్మికశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలోని అన్ని పరిశ్రమలు, ప్రైవేటు వ్యాపార సంస్థలు, దుకాణాలను తనిఖీ చేసి అక్కడ పని చేసే వారి వివరాలను సేకరించాలన్నారు. 14ఏళ్ల లోపు బాలలు ఎక్కడా పనిచేయడానికి వీలు లేదన్నారు. 15 నుంచి 18ఏళ్ల పిల్లలు ప్రమాద రహిత సంస్థల్లో మాత్రమే పని చేయడానికి అవకాశం ఉందన్నారు. కార్మికశాఖ ఉప కమిషనర్ సునీత, డీఆర్వో మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

★ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి, సురక్ష బీమా యోజన పథకాల ప్రయోజనాలను ప్రజలకు తెలియజేసి, వాటిల్లో ఎక్కువ మంది చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. వచ్చే ఏడాది జనవరి 15 వరకు వీటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

4గంటల్లో అదృశ్యమైన వృద్ధురాలి గుర్తింపు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఫిర్యాదు చేసిన నాలుగు గంటల వ్యవధిలోనే పోలీసులు వృద్ధురాలిని గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అల్లిపురం మిరపకాయల వీధికి చెందిన వృద్ధురాలు నల్లి లక్ష్మి (70ఏళ్లు) ఆదివారం మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయారు. సాయంత్రం వరకు ఆమె కోసం వెతికిన కుటుంబ సభ్యులు ఫలితం లేకపోవడంతో రాత్రి 8 గంటలకు రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు రాత్రి 12 గంటకు అల్లిపురం పరిసరాల్లో లక్ష్మి ఆచూకీ కనుగొన్నారు. సీఐ తిరుమలరావు ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించారు.



నల్లి లక్ష్మిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న సీఐ తిరుమలరావు

జోన్-5 ఏపీడీగా పుణ్యవతి



జ్ఞానాపురం, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-5 ఏపీడీగా పుణ్యవతిని నియమిస్తూ జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఆమె జెడ్సీ రామును కలిసి బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఇక్కడ పనిచేసిన పద్మావతిని జోన్-4 ఏపీడీగా నియమించారు. ఆమె కూడా సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

జోన్ స్థాయి సమస్యలపై సమావేశాలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థ ఎనిమిది జోనల్ కార్యాలయాల పరిధిలోని సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికి ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేయాలని కమిషనర్ పి.సంపత్ కుమార్ నిర్ణయించారు. మంగళవారం జోన్-2 మధురవాడ కార్యాలయంలో మొదటి సమావేశం నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మిగతా జోన్లలో సమావేశాలు ఏర్పాటు చేయనున్నారు. విభాగాధిపతులు సైతం పాల్గొనాలని కమిషనర్ ఆదేశించారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: నర్సుల సంఘం ఎన్నికల సమయం దగ్గరపడుతుండడంతో బి.ఉషారాణి ప్యానల్ సభ్యులు సోమవారం ప్రచారం నిర్వహించారు. జి.శాంతమ్మ, జైతు రవీంద్రనాథ్, ఎన్.ప్రశాంతి, ఎన్.పద్మజ, ఎం.సుజాతరావు, కె.వరలక్ష్మి ఈ ప్యానెల్ నుంచి పోటీ చేస్తున్నారు. తమకు ఓటు వేసి గెలిపించాలని, నర్సుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. మహ్మద్ అబిబుల్లా ఖాన్ మెమోరియల్ సంఘం ఈ ప్యానెల్‌కు మద్దతు ప్రకటించి ప్రచారంలో పాల్గొందని ప్రధాన కార్యదర్శి దేవరకొండ మార్కండేయులు ఒక ప్రకటనలో తెలిపారు.



కేజీహెచ్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఉషారాణి ప్యానల్ సభ్యులు

ప్రధాన రహదారిలోనే అపరిశుభ్రత

కార్పొరేషన్, న్యూస్‌టుడే

పాతనగరం టౌన్‌కొత్త రోడ్డులో కాలువల నుంచి మురుగు రహదారిపైకి చేరి పరిసరాలు దుర్వాసనతో నిండిపోతున్నాయి. ఇక్కడ రహదారి నిర్మాణంలో భాగంగా కొత్తగా కాలువలను నిర్మించారు. అయితే అందులో మురుగునీరు సక్రమంగా పారుదల కాకుండా రహదారిపైకి చేరుతోంది. నిత్యం రద్దీగా ఉండే ఈమార్గంలో 20 రోజులుగా ఈ దుస్థితి ఉన్నా వార్డు పారిశుద్ధ్య, పర్యావరణ కార్యదర్శి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. మురుగు నిల్వ ఉండి పోతుండటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు నీటిని మళ్లించి, శుభ్రపరచాలని కోరుతున్నారు.



టౌన్‌కొత్త రోడ్డులో అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలు

విమ్స్‌లో రొమ్ము క్యాన్సర్‌పై ఉచిత అవగాహనా శిబిరం నేడు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: విమ్స్ ఆసుపత్రిలో మంగళవారం రొమ్ము క్యాన్సర్‌పై ఉచిత అవగాహనా శిబిరం నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. అనుభవం కలిగిన మహిళా వైద్యులు రొమ్ము క్యాన్సర్ నిర్ధరణ వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరం అయిన వారికి బెస్ట్ అల్ట్రాసౌండ్, బయాప్సి తదితర వైద్యపరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులందిస్తారన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్న ఈ వైద్య శిబిరాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఐటీఐల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కంచరపాలెం: ఐటీఐల్లో మిగులు సీట్ల భర్తీకి అయిదో విడత ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు దరఖాస్తులు ఈనెల 26లోగా చేసుకోవాలని ప్రిన్సిపల్ జె.శ్రీకాంత్ తెలిపారు. ఇప్పటికే నాలుగు విడతల్లో కౌన్సెలింగ్ నిర్వహించినపుడు దాదాపు అన్ని సీట్లు ప్రభుత్వ ఐటీఐల్లో భర్తీ అయ్యాయన్నారు. ఈనెల 28న ప్రభుత్వ ఐటీఐలకు, 30న ప్రయివేటు ఐటీఐలకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఎక్కడ దరఖాస్తు చేశారో అక్కడే కౌన్సెలింగ్‌లో పాల్గొనాలని ఆయన తెలిపారు.

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ కోసం ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులను ఆహ్వానిస్తున్నామని ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. ఈనెల 30లోగా www.apprenticeshipindia.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు పంపాలన్నారు. విశాఖ పరిధిలో డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, పెయింటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. నవంబరు 6న అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

41వ వార్డులో కుక్కల పట్టివేత

స్పందనకు వందనం



కుక్కలను పట్టుకుంటున్న జీవీఎంసీ సిబ్బంది

జ్ఞానాపురం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 41వ వార్డులో స్వైరవిహారం చేస్తున్న కుక్కలను జీవీఎంసీ సిబ్బంది సోమవారం పట్టుకుని తరలించారు. ఈనెల 21న 'బిగ్గరగా అరుపులు... వెంటపడి దాడులు' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ పశువైద్యాధికారులు స్పందించారు. సిబ్బందిని పంపించి బాబుకాలనీలోని కుక్కలను పట్టుకుని తరలించారు. వార్డులోని మిగతా ప్రాంతాల్లో ఉన్న కుక్కలను కూడా పట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విజేతలకు అభినందన



ప్రతిభ చూపిన విద్యార్థులతో అధ్యాపకులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: విద్యార్థి స్థాయి నుంచే యువత తమలోని ప్రతిభను చాటాలని కంకటాల సీఎండీ కంకటాల మల్లికార్జునరావు అన్నారు. ప్రపంచ చెఫ్ దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్, సన్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 'స్వచ్ఛమైన ఆహారం' పేరిట పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతి గ్రీన్‌డెల్ విద్యార్థిని అదిరిట గోగి, ద్వితీయ బహుమతి నారాయణ పాఠశాల విద్యార్థిని అలోక్యనా, తృతీయ బహుమతి హన్సిక, కె.రహనిక గెలుపొందారు. విజేతలను మల్లికార్జునరావు అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ధర్మేందర్, యూత్ సర్వీసెస్ సంచాలకులు ఆశా జాస్తి కరుణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు అర్జీల వెల్లువ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, ఇతర అధికారులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి అర్జీలు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు 230 అర్జీలు అందజేశారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, జేసీ మయూర్ అశోక్, డీఆర్వో మోహన్‌కుమార్, ఆర్డీఓ శ్రీలేఖ, జీవీఎంసీ అదనపు కమిషనర్ వర్మ, ఇతర అధికారులు వాటిని స్వీకరించారు. వ్యక్తిగత సమస్యలపై అధికంగా అందాయి. రెవెన్యూ విభాగానికి 84, జీవీఎంసీకి 65, పోలీసుశాఖకు 12, ఇతర శాఖలకు 69 చొప్పున వచ్చాయి. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలకు నాణ్యమైన పరిష్కారాలు చూపాలని ఆదేశించారు.

సీపీ కార్యాలయంలో...

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : పోలీసు సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు విశేష స్పందన లభించింది. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. తక్షణమే సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించటంలో అలసత్వం వహించవద్దని ఆదేశించారు. మొత్తం 98 ఫిర్యాదులు అందాయి. ఎ.సి.పి.లు, సి.ఐ.లు వారి వారి కార్యాలయాల్లో ఉంటూ పలువురి నుంచి వినతులు స్వీకరించారు.



బాధితులతో మాట్లాడుతున్న సి.పి. శంఖబ్రత బాగ్చీ

జీవీఎంసీలో...



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: జీవీఎంసీకి వస్తున్న ప్రజా సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినతుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేకంగా సమయం కేటాయించాలని సూచించారు. ★ బక్కన్నపాలెంలో ముస్లిం శ్మశానవాటిక నిర్మించాలని 2010 నుంచి కోరుతున్నా పట్టించుకోవడంలేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఎంవీపీకాలనీలో ఉన్న తన నివాసం ఇంటి నెంబరు బీచ్‌రోడ్డులోని పాండురంగస్వామి ఆలయం వద్ద ఉన్నట్లు చూపుతోందని, చిరునామా మార్చాలని ఇంటి యజమాని కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మొత్తం 77 వినతులు వచ్చాయి. వాటిలో జోన్-1కు రెండు, జోన్-2కు 8, జోన్-3కు 14, నాలుగో జోన్‌కు 5, ఐదో జోన్‌కు 16, ఆరో జోన్‌కు 5, ఏడో జోన్‌కు ఒకటి, జోన్-8కు 9, జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి 17 చొప్పున వచ్చాయి.

పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



గౌరవ వందనం సమర్పిస్తున్న ఆర్పీఎఫ్ సీనియర్ డీఎస్సీ ఏపీ దుబే

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీస్ అమర వీరుల త్యాగాలు చిరస్మరణీయమని వాల్తేర్ ఆర్పీఎఫ్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ ఏపీ దుబే అన్నారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వాల్తేర్ ఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో షాహిద్ స్మారక్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని అమర వీరులకు నివాళులర్పించారు. రైల్వే ఆస్తులను పరిరక్షించడంలో ఆర్పీఎఫ్ సిబ్బంది చేస్తున్న కృషిని కొనియాడారు.

సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలి: కమిషనర్

కార్పొరేషన్: సమస్యల పరిష్కారానికి జీవీఎంసీ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం ఆయన టెలికాన్ఫరెన్స్ ద్వారా జెడ్సీలు ఇతర అధికారులతో సమావేశమయ్యారు. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వాణిజ్య సముదాయాల నుంచి బకాయిల వసూళ్లు, కోర్టు కేసులపైనా తరచూ సమీక్షించుకోవాలన్నారు. సమావేశంలో ప్రధాన ఇంజినీరు శివప్రసాద రాజు, ఏడీసీ రమణమూర్తి, వ్యయ పరిశీలకుడు వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

పోలీసుల సంక్షేమానికి పెద్దపీట

పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ



సంస్మరణ కార్యక్రమంలో పోలీసుల కవాతు



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా అధికారులు, నేతలు, ప్రముఖులు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : పోలీసుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. బీచ్‌రోడ్డులో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని సోమవారం ఉదయం అమరవీరుల స్తూపానికి సీపీ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. పోలీసులు బాగుంటే వారి కుటుంబాలు బాగుంటాయన్నారు. సమస్యలు లేకపోతే విధులు సక్రమంగా నిర్వహిస్తారన్నారు. అప్పుడే నగరం ప్రశాంతంగా ఉంటుందన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించేలా త్వరలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా అదనపు బృందాలు ఏర్పాటు చేసి గంజాయి తరలిస్తున్న వారిని అదుపులోకి తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా అమరులైన పోలీసు సిబ్బంది కుటుంబాలకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లాజడ్జి ఆలపాటి గిరిధర్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, గాజువాక ఎమ్మెల్యే, తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, డీసీపీలు, ఏసీపీలు, నగర ప్రముఖులు హాజరై అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీసులు అమరవీరులకు పోలీసు బ్యాండుతో నివాళులు అర్పించారు. మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. వ్యాఖ్యాతలుగా లక్ష్మీ స్వరూప, మమత వ్యవహరించారు.

గోల్డ్ డిపాజిట్ పథకంలో అప్పన్న ఆభరణాలు



బ్యాంకులో డిపాజిట్ చేసిన బంగారు ఆభరణాలు



స్టేట్‌బ్యాంకు అధికారికి బంగారు ఆభరణాలు అప్పగిస్తున్న సింహాచలం ఈవో త్రినాథరావు, దేవాదాయశాఖ అధికారులు

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామికి భక్తులు కానుకల రూపంలో సమర్పించిన బంగారు ఆభరణాలు, వస్తువులను దేవస్థానం అధికారులు గోల్డ్ డిపాజిట్ పథకంలో జమ చేశారు. భక్తులు హుండీల్లో సమర్పించిన బంగారు ఆభరణాలు, వస్తువులను అధికారులు ఆలయ భాండాగారంలో భద్రపరిచారు. వాటిని ఈవో వేండ్ర త్రినాథరావు, దేవాదాయశాఖ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సింహగిరిపై తూకం వేశారు. కానుకల రూపంలో లభ్యమైన 4.380 కిలోల బంగారాన్ని నగరంలోని ఎస్బీఐ ప్రధాన శాఖలో డిపాజిట్ చేశారు. ఈ మేరకు వాటిని బ్యాంకు ప్రతినిధి నరసింహరాజుకు అందజేశారు. ఇప్పటి వరకు దేవస్థానం సుమారు 50కిలోల బంగారాన్ని డిపాజిట్ల రూపంలో జమ చేసింది. వీటి నుంచి ఏటా సుమారు రూ.40లక్షల వరకు వడ్డీ సమకూరుతుంది. ఈ కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ఉప కార్యనిర్వహణాధికారి రాధ, దేవాదాయశాఖ ఆర్‌జేసీ (రాజమహేంద్రవరం) సుబ్బారావు, జువెలరీ వెరిఫికేషన్ అధికారి పల్లంరాజు, దేవస్థానం ఏఈవోలు ఎన్.ఆనంద్‌కుమార్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పెచ్చుమీరిన యూసీడీ సిబ్బంది ఆగడాలు

ఆర్పీపై మహిళల ఫిర్యాదు



కమిషనర్ సంపత్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న మహిళలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థ యూసీడీ (పట్టణ సామాజికాభివృద్ధి) సిబ్బంది ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. మెప్మా నుంచి వచ్చి జీవీఎంసీలో డీసీఎంగా (డిస్ట్రిక్ట్ మిషన్ కో-ఆర్డినేటర్) విధులు నిర్వహించిన అధికారి మహిళా సంఘాల నుంచి రూ.కోట్లు తీసుకున్నట్లు ఇటీవల తెదేపా కార్పొరేటర్ రాపర్తి కన్నా ఆధారాలను బయటపెట్టడంతో కమిషనర్ ఆయన్ను సస్పెండ్ చేశారు. డీసీఎం వ్యవహారంతో పాటు, యూసీడీ సిబ్బంది అక్రమాలపై అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మను విచారణాధికారిగా నియమించారు. త్వరలో ఆయన విచారణ ప్రారంభించనున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న డీసీఎంకు సహకరించిన ఇద్దరు ఆర్పీలను కమిషనర్ సస్పెండ్ చేశారు. అయితే తమను ఎవరూ సస్పెండ్ చేయలేదని మహిళా సంఘాల ప్రతినిధులకు చెబుతూ క్షేత్రస్థాయిలో యూసీడీ వ్యవహారాలన్నీ వారే నడిపిస్తుండడం గమనార్హం. సోమవారం 98వ వార్డుకు చెందిన 70 మంది డ్వాక్రా మహిళలు జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి వచ్చి కమిషనర్ సంపత్‌కుమార్‌ను కలిశారు. ఆర్పీ లక్ష్మీ ప్రసన్న వేధింపులు భరించలేకపోతున్నామని, ప్రతి విషయానికి డబ్బులు డిమాండ్ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తోందని ఫిర్యాదు చేశారు. అధికారులు ఆమెను సస్పెండ్ చేశామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తోందని తెలిపారు. పలువురు యూసీడీ అధికారులు ఆమెకు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను తన వద్ద ఉంచుకుని వడ్డీలు చెల్లిస్తానని చెబుతోందని, ప్రభుత్వ నిధులు, రాయితీలు అందకుండా చేస్తోందని వాపోయారు.

తల్లిదండ్రులు డబ్బులివ్వలేదని.. పుట్టినరోజునే కుమారుడి ఆత్మహత్య

విశాఖపట్నం, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు డబ్బులు ఇవ్వలేదని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన విశాఖలోని పీఎంపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలిలా.. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ యువకుడు పీఎంపాలెంలోని ఓ కాలనీలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నాడు. తండ్రి వంట మాస్టర్‌గా పనిచేస్తూ కుమారుడిని చదివిస్తున్నారు. సోమవారం తన పుట్టినరోజు కావడంతో స్నేహితులతో పార్టీ కోసం కొడుకు తల్లిదండ్రులను డబ్బులు అడిగాడు. ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నందున ఇలాంటి ఖర్చులకు దూరంగా ఉండాలని వారు అతడిని వారించారు. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యాన్ హుక్కుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తాము డబ్బులిస్తే కుమారుడు బతికేవాడని పరోక్షంగా ఈ మృతికి తామే కారణమంటూ తల్లిదండ్రులు రోదించడం పలువురిని కలచి వేసింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

కేజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

పల్మనరీ అర్టెరీలో త్రంబస్ తొలగింపు



కోలుకున్న హరికృష్ణతో డాక్టర్ పి.శివానంద, డాక్టర్ మణిత, డాక్టర్ పద్మజ తదితరులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కేజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించామని ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ శివానంద తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నగరానికి చెందిన హరికృష్ణ (35) ఈనెల 10న మెడికల్ వార్డు నుంచి రిఫరల్ కేసుగా కార్డియో థొరాసిక్ వార్డుకు వెళ్లారు. అతనికి దగ్గుతో పాటు గొంతు నుంచి రక్తం పడేది. థొరాసిక్ విభాగ వైద్యులు పరీక్షలు నిర్వహించగా పల్మనరీ అర్టెరీలో త్రంబస్ (రక్తనాళాలు మూసుకుపోయినట్లు) ఉన్నట్లు గుర్తించారు. దీనికి బయట చికిత్స చేయించుకోవాలంటే రూ.10లక్షల నుంచి రూ.15లక్షల వరకు ఖర్చు అవుతుంది. పైగా శస్త్రచికిత్స హైరిస్కుతో కూడిన వ్యవహారం. ఈ విషయం హరికృష్ణ భార్య, కుటుంబ సభ్యులకు తెలియజేసి, వారి సమ్మతితో ఈనెల 11న క్లిష్టమైన శస్త్రచికిత్సను థొరాసిక్ విభాగ వైద్య బృందం విజయవంతంగా నిర్వహించిందని డాక్టర్ శివానంద వివరించారు. పల్మనరీ అర్టెరీలో 8/3సెంటీ మీటర్ల మేర ఉన్న త్రంబస్‌ను తొలగించడంతో హరికృష్ణ ఆరోగ్యం సాధారణ స్థితికి చేరుకుందన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఉచితంగా చికిత్స అందించామన్నారు. ఇటువంటి వ్యాధులు జన్యుపరంగా రావడానికి అవకాశం ఉందని వివరించారు. థొరాసిక్ విభాగ వైద్యాధికారులు మణిత, పద్మజ, సతీష్, రమేష్, భవానీ బృందాన్ని అభినందించారు.

పూర్వ సీఈపై విచారణకు ఆదేశం!

పెదవాల్తేరు: విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ముఖ్య ఇంజినీర్‌గా గతంలో విధులు నిర్వహించిన వి.చంద్రయ్య మీద ప్రభుత్వం శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. ప్రస్తుతం ఆయన పదవీ విరమణ చేశారు. కాలుష్య నియంత్రణకు ఎన్‌టీపీసీ, ఏపీఐఐసీ నిధులతో వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో ప్రాజెక్టు చేపట్టారు. ఆయన సీఈగా ఉండగా నిధుల వినియోగంలో పర్యవేక్షణ లోపాన్ని గుర్తించారు. ఆ పనులకు సాంకేతిక అనుమతులు ఇచ్చిన ఆయన ఆ సంస్థలకు నష్టం కలిగించేలా వ్యవహరించడం, గుత్తేదారుకు మేలు కలిగేలా చేశారన్న విమర్శలపై విచారణకు పురపాలక శాఖ సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది.

విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేత



విజేతలతో కలెక్టర్ హరేంధిరప్రసాద్, జేసీ మయూర్ అశోక్, డీఈఓ చంద్రకళ తదితరులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా మండల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, బృంద చర్చ(డిబేట్) పోటీల్లో విజేతలుగా నిలిచిన 63 మంది విద్యార్థులకు సోమవారం కలెక్టర్ హరేంధిరప్రసాద్ కలెక్టరేట్‌లో ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రతి కేటగిరీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, డీఈఓ ఎల్.చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

23న ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం విశాఖ జిల్లా యూనిట్ ఎన్నికలు ఈనెల 23న కేజీహెచ్ ఆవరణలోని నర్సుల క్లాక్‌రూమ్‌లో నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి బి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, తర్వాత ఓట్లు లెక్కించి విజేతలను ప్రకటిస్తామన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న నర్సులంతా ఓటర్లేనన్నారు. వారు ఓటు వేసేందుకు ఏదో ఒక గుర్తింపు కార్డుతో రావాలన్నారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో ప్రచార బ్యానర్లు, ఫ్లెక్సీలు, టెంట్లు ఏర్పాటు చేయరాదని సూచించారు.

కేకే లైన్లో పట్టాలు తప్పిన గూడ్స్





రైళ్ల మధ్య నడుచుకుంటూ వస్తున్న ప్రయాణికులు

అనంతగిరి, న్యూస్‌టుడే: కేకే (కొత్తవలస-కిరండూల్) రైలుమార్గంలో సోమవారం ఉదయం గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. విశాఖపట్నం వైపు వెళ్తున్న గూడ్స్ బోగీలో ఒక చక్రం అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం చిమిడిపల్లి స్టేషన్ వద్ద కిందకు జారింది. హుటాహుటిన సిబ్బంది అక్కడకు చేరుకుని మరమ్మతులు చేపట్టారు. రూట్ క్లియర్‌గా లేకపోవడంతో మరో గూడ్సు రైలును బొర్రాస్టేషన్ వద్ద నిలిపివేశారు. అదే సమయంలో రైల్వే సిబ్బందికి సంబంధించిన ఓ రైలు నాలుగు బోగీలతో రాగా దాన్ని కూడా బొర్రా స్టేషన్‌లోనే నిలిపారు. ఇవి రెండు వైపులా ఉండటం, అదే సమయానికి కిరండూల్ పాసింజర్ రావడంతో దాన్ని మధ్యలో ఉన్న లైనులో ఆపారు. ప్రయాణికులు దిగేందుకు ప్లాట్‌ఫాం అందుబాటులో లేకపోవడంతో రెండు రైళ్ల మధ్య నుంచి నడుచుకుని బయటకు రావాల్సి వచ్చింది. మరమ్మతుల అనంతరం మిగతా రైళ్ల రాకపోకలకు మార్గం సుగమం చేశారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	120	115
లైవ్	142	135
డ్రెస్డ్	206	240
స్కిన్‌లెస్	234	250

గాజువాక

• గాజువాక • విశాఖ పశ్చిమం

ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు

అగనంపూడి, న్యూస్‌టుడే: అగనంపూడి పరిధి కాలనీల్లో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ తెలిపారు. సోమవారం వార్డు పరిధిలోని కుమ్మరివీధిలో జరుగుతున్న డ్రెయినేజీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వార్డు తెదేపా నాయకులు ఎం.వెంకటరావు, సింగిడి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



కాలువ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్ తదితరులు

స్వచ్ఛతతోనే ఆరోగ్యకరమైన సమాజం

కరాస: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే ఆరోగ్యకరమైన సమాజంతో పాటు దేశానికి మంచి భవిష్యత్తు ఉంటుందని మర్రిపాలెం రైతుబజారు రైతులు అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా సోమవారం రైతుబజారులో కలిసి రైతుబజారు ఆవరణలో పిచ్చి మొక్కలను ఏరివేశారు.. ఈ స్థానంలో మంచి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్ అధికారి వరహాలు, సహాయకుడు ప్రతాప్, డ్వాక్రా గ్రూప్ సభ్యులు, ఇతర వాణిజ్య వ్యాపారులు పాల్గొన్నారు.



మర్రిపాలెం రైతుబజారు ఆవరణలో పిచ్చిమొక్కలను ఏరివేస్తున్న రైతులు

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గాజువాక, పెదగంట్యాడ

సమస్య: అగనంపూడి శివారు శనివాడ, చుట్టు పక్కకాలనీల్లో వీధి దీపాలు వెలగడం లేదు. – అప్పారావు, అగనంపూడి

సమాధానం: మరమ్మతులకు గురైన దీపాలను పునరుద్ధరిస్తాం. – శివ, వీధి దీపాల నిర్వహకుడు

సమస్య: చినగంట్యాడ గొంతెనవానిపాలెంలో వీధి కాలువలు పూడిక వల్ల అధ్వానంగా ఉన్నాయి. – సన్యాసిరావు, చినగంట్యాడ

సమాధానం: పరిశీలించి శుభ్రత పనులు చేపడతాం. – డాక్టర్ కిరణ్‌కుమార్, ఏఎంఓహెచ్

ప్రమాదాలు జరగకుండా చర్యలు...



గంగవరం రోడ్డులో విభాగిని పనుల్లో ట్రాఫిక్ సిబ్బంది

గాజువాక, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదాల నియంత్రణ చర్యల్లో భాగంగా న్యూపోర్టు ట్రాఫిక్ పోలీసులు పెదగంట్యాడ లోని పలు కీలక కూడళ్లు, బ్లాక్ స్పాట్ ప్రాంతాల్లో డివైడర్లకు తుది మెరుగులు దిద్దారు. బీసీ రోడ్డు గాంధీ విగ్రహం సెంటర్ నుంచి గంగవరం మత్స్యకార గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి, ఆటోనగర్ అనుసంధాన రోడ్డు, వెంకన్నపాలెం, సత్యనారాయణపురం, కొంగపాలెం వెళ్లే దారుల్లో విభాగినులకు రంగులు, రేడియం పెయింటింగ్, మరమ్మతులు చేపట్టారు. ట్రాఫిక్ ఎస్ఐ మహాలక్ష్మి, సిబ్బంది దగ్గరుండి పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈ మార్గాల్లో ప్రమాదాలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు సిబ్బంది తెలిపారు.

అస్తవ్యస్తంగా విద్యుత్తు తీగలు



మల్కాపురం రహదారి విభాగినిలో..

పారిశ్రామిక ప్రాంతంలోని రహదారుల విభాగినుల్లో ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభాలకు ఉన్న తీగలు బయటకొచ్చి ప్రమాదకరంగా మారాయి. వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించే సమయంలో తీవ్ర భయాందోళన చెందుతున్నారు. విద్యుత్తు స్తంభాల అడుగుభాగంలో వేలాడుతున్న తీగలను విద్యార్థులు, పశువులు ఏమాత్రం తాకినా భారీ మూల్యం చెల్లించుకోకతప్పదు. సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్తు తీగలు బయటకు కనిపించకుండా సరి చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, మల్కాపురం



రామకృష్ణాపురంలోని హెచ్‌పీసీఎల్ రిఫైనరీ గేటు ఎదురుగా..

జిల్లాలోని 29 సాగునీటి సంఘాలకు ఎన్నికలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలోని 29 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ హరేంధిరప్రసాద్ సోమవారం ఎన్నిక నోటిఫికేషన్ విడుదల చేశారని చెప్పారు. 40రోజుల పాటు ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుందని, ఆయా సాగునీటి ఆయకట్టు పరిధిలోని రైతులు సభ్యులుగా ఉంటారని చెప్పారు. నవంబరు 21 నుంచి 23 వరకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈలోపు ఓటరు జాబితాల తయారీ, ప్రాదేశిక నియోజక వర్గాల ఏర్పాటు తదితర ప్రక్రియలను పూర్తి చేస్తామన్నారు. చివరిసారిగా 2015లో ఎన్నికలు జరిగాయని, తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సంక్షిప్త సమాచారం..

● యుద్ధ ప్రాతిపదికన రక్షణ గోడ నిర్మాణం

మల్కాపురం, న్యూస్‌టుడే: గత నెలలో కురిసిన వర్షాల కారణంగా జీవీఎంసీ 62వ వార్డు తెదేపా కాలనీ కొండవాలుపై సీసీ రోడ్డుతో పాటు రక్షణ గోడ కూలిన సంగతి తెలిసిందే. వీటి పునర్నిర్మాణానికి జీవీఎంసీ రూ.12.5 లక్షలు మంజూరు చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడుతున్నారు. ఆయా పనులను సోమవారం పార్టీ శ్రేణులతో కలిసి వార్డు తెదేపా అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటించి జనాలకు ఇబ్బందులు లేకుండా పనులను వేగవంతంగా పూర్తిచేయాలని గుత్తేదారు, అధికారులకు సూచించారు.

● కంట్రోల్ రూం ఏర్పాటు

సింధియా, న్యూస్‌టుడే: భారీ వర్ష సూచనతో ఎదురయ్యే సమస్యల కోసం ములగాడ మండల కార్యాలయంలో జిల్లా అధికారుల ఆదేశాలతో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. కొండవాలు ప్రాంత వాసులంతా అప్రమత్తంగా వుండాలని ఎమ్మార్వో భుజంగరావు పేర్కొన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా వార్డు సచివాలయాల వీఆర్వోలను కార్యాలయంలో అందబాటులో వుంచినట్లు వెల్లడించారు.

● నాగుపాముకు చికిత్స

అగనంపూడి, న్యూస్‌టుడే: తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న నాగుపాముకు అగనంపూడి పశువైద్య కేంద్రం సిబ్బంది చికిత్స అందించి కాపాడారు. సోమవారం స్థానిక బీసీ కాలనీలో అయిదు అడుగుల పొడవున్న నాగుపాము కనబడడంతో స్థానికులు భయాందోళన చెందారు. స్నేక్ సేవర్ సొసైటీ అధ్యక్షుడు ఆర్.కిరణ్‌కు సమాచారం అందించడంతో ఆయన వచ్చి పామును పట్టుకున్నారు. అప్పటికే అది తీవ్ర గాయాలతో ఉండడంతో పశువైద్య కేంద్రానికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. కోలుకున్నాక అడవిలో విడిచి పెడతానని కిరణ్ తెలిపారు.



నాగుపాముకు చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

● సమ్మె వాయిదా వేయండి: ఆర్‌జేసీఎల్

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు–3), న్యూస్‌టుడే: జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు విశాఖ ఉక్కు కర్మాగారంలో స్థానిక సమస్యలపై ఈ నెల 28న నిర్వహించ తలపెట్టిన సమ్మెను వాయిదా వేసుకోవాలని ప్రాంతీయ జాయింటు లేబర్ కమిషనర్ కె.జె.మొహంతి కోరినట్టు కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. నగరంలోని ఆర్‌జేసీఎల్ కార్యాలయంలో కార్మిక సంఘాలతో సోమవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కార్మిక నాయకులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా ఇంటి అద్దె అలవెన్సు, విద్యుత్ ఛార్జీల పెంపు, వేతన సవరణ, బోనస్, ఎల్‌టీసీ, ఎల్‌ఎల్‌టీసీ, తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. దానిపై ఆయన స్పందిస్తూ రెండో బ్లాస్ట్ ఫర్నేస్‌లో ఉత్పత్తి ప్రారంభించేందుకు అధికారులు కృషి చేస్తున్నారన్నారు. సమ్మె వాయిదా తాము చర్చించుకున్న తర్వాత తెలియజేస్తామని కార్మిక సంఘాల నాయకులు బదులిచ్చినట్లు తెలిపారు. సమావేశంలో డి.ఆదినారాయణ, జె.రామకృష్ణ, పి.వి.రమణమూర్తి, యు.రామస్వామి, గణపతిరెడ్డి, మహాలక్ష్మినాయుడు, వి.రామ్మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● మురుగు కాలువలో పడి కార్మికుడి మృతి!

చీమకుర్తి, న్యూస్‌టుడే: మురుగు కాలువలో పడి ఓ కార్మికుడు మృతి చెందారు. ప్రకాశం జిల్లా చీమకుర్తి పట్టణంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నంలోని గాజువాకకు చెందిన పీరు(47) గత పదేళ్లుగా చీమకుర్తిలో ఉంటున్నారు. వివిధ క్వారీల్లో జాకీ కార్మికుడిగా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం... ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం ఎదురుగా ఉన్న మురుగు కాలువలో విగతజీవిగా పడి ఉన్న ఆయనను స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. ఆదివారం రాత్రి... మద్యం మత్తులో కాలువలో పడిపోయి ఉండొచ్చని భావిస్తున్నారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ ఎం.సుబ్బారావు తెలిపారు.



బృందగానంలో విద్యార్థులు

జాతీయ సమైక్యతను చాటేలా...

కరాస, న్యూస్‌టుడే : రాష్ట్రీయ ఏక్ పర్వ్, ఏక్ భారత్, శ్రేష్ఠభారత్ కళా ఉత్సవం-2024 వేడుకలను 104 ఏరియా, శ్రీవిజయనగర్ కేంద్రీయ విద్యాలయ నెం-2లో సోమవారం ఘనంగా ప్రారంభించారు. హైదరాబాద్ రీజియన్ పరిధిలో ఉన్న ఆంధ్రా, తెలంగాణకు చెందిన సుమారు మూడు వందల మంది విద్యార్థులు, 70 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ ఉత్సవాల్లో భాగంగా లలిత కళలు, బృందగానం తదితర అంశాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రధానాచార్యులు సీహెచ్ శ్రీనివాసులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు నరసింహం, ఉపాధ్యాయులు బాలాజీ, రామ్‌భూపాల్, రామచంద్రరావు, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

నేడు పైడిమాంబ అమ్మవారి పండగ

గాజువాక, న్యూస్‌టుడే: గాజువాక 70వ వార్డు శ్రామికనగర్, ఎర్రగడ్డకాలనీల గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి ప్రధాన పండగ మంగళవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. దీనిలో భాగంగా సోమవారం అమ్మవారి కలశ యాత్ర, ఘటాల ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది. మంగళవారం ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకోవడానికి అవకాశం కల్పిస్తారు. నేల వేషాలు, కోలాటాల నడుమ పండగ జరుగుతుందని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.



ఊరేగింపులో పాల్గొన్న మహిళలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం పీవీఎస్‌ఎస్ఎస్ ఆంజనేయ, ఉపాధ్యాయులు

ఉత్సాహంగా పాల్గొని.. విజేతగా నిలిచి

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో జీవీఎంసీ 68వ వార్డు మింది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 'అంతర్జాలం వినియోగం వల్ల లాభ నష్టాలు, సామాజిక మాధ్యమాల ప్రభావం వంటి అంశాలపై వ్యాసరచన పోటీలు జరిపారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారు. అంశాన్ని విభిన్న కోణాల్లో మెప్పించి తమ ప్రతిభను చాటుకున్నారు. విజేతలుగా నిలిచిన పి.సుజాత, బి.కుశాలిని, జాస్మిని నహాగ్‌లకు పాఠశాల హెచ్‌ఎం పీవీఎస్ఎస్ఎస్ ఆంజనేయ చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చైతన్య, రమాదేవి, శంకర్రావు, సుజాత, శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

గైరమ్మ సంబరాలు ప్రారంభం

సింధియా, న్యూస్‌టుడే: పారిశ్రామిక ప్రాంతం 61వ వార్డు మల్కాపురంలో సోమవారం సాయంత్రం గైరమ్మ సంబరాలు ప్రారంభమయ్యాయి. ఈమేరకు ఏటా నిర్వహించే పండుగ నిర్వాహకులు కాకి పోలిరెడ్డి కుటుంబీకులంతా ఆంజనేయస్వామి గుడి నుంచి సంబరాల ఊరేగింపును చేపట్టారు. ఈ అమ్మవారి ఊరేగింపును హనుమాన్ మందిర్ నుంచి రెడ్డి వీధి వరకు కొనసాగించారు. సంబరాల్లో కోలాట ప్రదర్శన, సాముగరిడీలు, డప్పు వాయిద్యాలతో గైరమ్మ ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో మల్కాపురం భక్తులు పాల్గొన్నారు.



గైరమ్మ సంబరాల ప్రారంభ పూజల్లో నిర్వాహకులు కాకి పోలిరెడ్డి తదితరులు

నడుపూరు విద్యార్థుల ప్రతిభ

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంటు పోటీల్లో నడుపూరు హైస్కూలు విద్యార్థులు వివిధ బహుమతులు సాధించారు. విద్యార్థులు వర్షిణి, సుహాని, గీతికలు ఈ డాక్యుమెంట్ల రూపకల్పన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా వీరు నగరంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, డీఈఓ చంద్రకళ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్, ఉపాధ్యాయుడు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



బాలికలను సత్కరిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సింధియా(నెహ్రూనగర్), న్యూస్‌టుడే: జీవీఎంసీ శానిటరీ విభాగంలో పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కాంట్రాక్టు కార్మిక సంఘం (సిటూ) గౌరవాధ్యక్షులు ఆర్.లక్ష్మణమూర్తి డిమాండ్ చేశారు. గుల్లలపాలెం వార్డు కార్యాలయం వద్ద నిర్వహించిన కాంట్రాక్టు వర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు నాలుగేళ్ల కిందట 2% ఆదాయపన్ను కోత విధించగా సిటూ చేసిన పోరాట ఫలితంగా తిరిగి ఖాతాకు జమచేశారని గుర్తుచేశారు. ఇంకా కార్మికుల ఖాతాలోకి ఆ మొత్తాలు జమ కాలేదని పేర్కొన్నారు. కార్మిక సమస్యలపై ఈనెల 22న జీవీఎంసీ మహాత్మగాంధీ విగ్రహం వద్ద నిరసన చేపడుతున్నామని వెల్లడించారు. జోన్ నాయకులు కె.రమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రతినిధులు డి.రాము, సూరిబాబు, కె.కృష్ణ, రైలుబాబు తదితరులు హాజరయ్యారు.

● ఉద్యోగి ఆత్మహత్య

భీమునిపట్నం, న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యలతోపాటు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు భీమిలి పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా.. భీమిలి గొల్లవీధిలో నివాసం ఉంటున్న శీల అనంత పద్మనాభరావు(56) గాజువాక తహసీల్దారు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు భార్య, కుమార్తె ఉన్నారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఈయన ఈనెల 19వ తేదీన ఇంట్లో చరవాణి వదిలిపెట్టి కోర్టు పనిమీద గాజువాక వెళ్తున్నట్లు చెప్పారు. సాయంత్రం తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. సోమవారం తెల్లవారుజామున భీమిలి బీచ్‌రోడ్డు కొబ్బరిచెట్ల పార్కులో కొన ఊపిరితో ఉన్న ఈయనను గస్తీ పోలీసులు గమనించి భీమిలి సీహెచ్‌సీలో చేర్పించినా ఫలితం లేకపోయింది. భార్య ఫిర్యాదు మేరకు మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎ.ఎస్.ఐ. సత్తిబాబు పేర్కొన్నారు.

ఐఎన్ఎస్ వీరబాహులో వైద్య కేంద్రం ప్రారంభం

సింధియా, న్యూస్‌టుడే: తూర్పు నావికాదళానికి చెందిన ఐఎన్ఎస్ వీరబాహులో సోమవారం ఆధునిక వైద్య తనిఖీ కేంద్రం ప్రారంభమైంది. ఈమేరకు కార్యక్రమానికి హాజరైన ఈస్టర్న్ నేవల్ కమాండ్ వైద్యాధికారి సర్జన్ రియర్ అడ్మిరల్ అజిత్ గోపీనాథ్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. వైద్య తనిఖీ కేంద్రాన్ని పూర్తిగా ఆధునికీకరించిన పరికరాలతో సదుపాయాలను సిబ్బందికి అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. ఆయుఃప్రవిధ క్లినిక్ ద్వారా వైద్య ఆరోగ్య సేవలకు ఎంతగానో ఉపయోగపడనుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైద్య బృందం, వీరబాహు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య తనిఖీ కేంద్రాన్ని ప్రారంభించిన సర్జన్ రియర్ అడ్మిరల్ అజిత్ గోపీనాథ్

మృతుడి కుటుంబానికి పరిహారం అందజేత

ఎన్ఏడీకూడలి(బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలేనికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు బి.ధనుంజయరావు ఇటీవల నగరంలోని ఓ భవనంపై నుంచి ప్రమాదశాత్తు జారి పడి మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం, సిటు ఆధ్వర్యంలో భవన యజమానితో చర్చలు జరిపారు. ఈ మేరకు రూ.10లక్షల పరిహారం అందించేందుకు ఆయన ఒప్పుకున్నారు. సోమవారం మృతుడి భార్యకు ఆ పరిహారం అందజేశారు. సంఘం గౌరవాధ్యక్షుడు బి.వెంకట్రావు, అధ్యక్షులు పి.అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల బాధితులకు అండగా తెదేపా

సింధియా, న్యూస్‌టుడే: పశ్చిమ నియోజకవర్గం పారిశ్రామిక ప్రాంత టిడ్కో ఇళ్ల బాధితులకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని 59వ వార్డు ప్రధాన కార్యదర్శి మితిరెడ్డి శంకర్ అన్నారు. ఈమేరకు సోమవారం హిమాచల్‌నగర్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన టిడ్కో ఇళ్ల బాధితుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అధ్యక్షతన సంబంధిత విభాగాల అధికారులు సమీక్ష జరిపారని స్పష్టం చేశారు. డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయినా నేటికీ ఇళ్లను అందించలేదని పలువురు లబ్ధిదారులు చెప్పారు. నెల వారీ బ్యాంకు వాయిదాలు కట్టాలని ఒత్తిళ్లు పెరుగుతున్నాయని తమ బాధను వెలిబుచ్చారు. సమావేశంలో నాయకులు సీతారామ్, నక్క లక్ష్మణరావు, సీహెచ్.రాము, కూటమి సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వార్డు ప్రధాన కార్యదర్శి మితిరెడ్డి శంకర్

గోపాలపట్నంలో సినిమాలు

కన్య: దేవర, హెవెన్: జనక అయితే గనక.., శ్రీకన్య: లక్ష్మి: హెవెన్: అరుణ (పెదగంట్యాడ): అన్నపూర్ణ (కూర్మన్నపాలెం): వేట్టయాన్ మోహినీ 70ఎంఎం: విశ్వం లక్ష్మీకాంత్: శ్వాగ్, మినీ మోహినీ: మార్టిన్, మోహినీ: జిగ్రా విశేష్: మా నాన్న సూపర్ హీరో శ్రీనరసింహ: జనక అయితే గనక, నరసింహ: వేట్టయన్, సౌజన్య: విశ్వం, సుకన్య: దేవర, మౌర్య: మార్టిన్

బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి

గోపాలపట్నం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్, గణేశ్‌నగర్‌కు చెందిన ఎన్.జాస్మిన్, ఎం.రామలక్ష్మీ అనారోగ్యానికి గురయ్యారు. వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఇద్దరికీ కలిపి ముఖ్యమంత్రి సహాయనిధి రూ. లక్ష మంజూరైంది. ఈ నేపథ్యంలో గోపాలపట్నంలో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు చేతుల మీదుగా బాధిత కుటుంబాలకు సహాయనిధి మంజూరు పత్రాన్ని, చెక్కులను అందజేశారు.



మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ఉపాధ్యాయులకు అంకితభావం అవసరం

కరాస, న్యూస్‌టుడే : ఉపాధ్యాయులందరూ అంకితభావంతో పనిచేస్తే గొప్ప ఫలితాలు వస్తాయని గోపాలపట్నం మండల విద్యాశాఖాధికారి అంబటి సోమేశ్వరరావు అన్నారు. సోమవారం ఆశివానిపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి బోధన టూల్ కిట్లు, హాజరుపట్టిక, మధ్యాహ్న భోజనం వంటి వాటిని పరిశీలించారు. విద్యార్థులతో కలసి భోజనం చేసి, పక్కనే ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవిరామ్, ఉపాధ్యాయులు బాలకృష్ణ, నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు దృశ్య రూపంలో బోధిస్తున్న ఎంఈఓ సోమేశ్వరరావు

విలువలతో కూడిన విద్య బోధించాలి

గోపాలపట్నం(కొత్తపాలెం), న్యూస్‌టుడే: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు విలువలతో కూడిన విద్య బోధించాలని గోపాలపట్నం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.సురేశ్ పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు భూషణం ఆధ్వర్యంలో సోమవారం జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులతో రాజకీయ లక్షణాలు అలవర్చుకోవాలన్నారు. క్రమశిక్షణ ఉండాలని, రోడ్డు భద్రత పాటించాలని, వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. పోలీస్ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీసుల అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రత్నమాల, రాజు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సీఐ సురేశ్, విద్యార్థులు, తదితరులు

ఆరోగ్య పరిరక్షణకు కృషి

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్య పరిరక్షణకు కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని గాజువాక 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి అన్నారు. సోమవారం అదానీ గంగవరం పోర్టు సీఎస్సార్‌లో భాగంగా నెల్లిముక్కు స్టేజీ వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ లాభార్జనే ధ్యేయంగా కాకుండా కార్పొరేట్ సంస్థలు సామాజిక సేవకు చొరవ చూపడం గొప్ప విషయమన్నారు. శివారు కాలనీలు, మురికివాడల్లోనూ ఇలాంటి శిబిరాలు మరిన్ని నిర్వహించాలని కోరారు. వార్డు తెదేపా అధ్యక్ష, కార్యదర్శులు దొమ్మేటి పెరుమాళ్లు, శ్రీముసిరి శ్రీనివాస్, ములకలపల్లి పెంటయ్య, పెద్దాడ సోమునాయుడు, బసా అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు



అమృతరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు

అమృతరావుకు ఘన నివాళి

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు–3), న్యూస్‌టుడే: ఉక్కు సత్యాగ్రహి టి.అమృతరావు జయంతి పురస్కరించుకుని ఉక్కు ఉద్యోగులు, కార్మిక నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. ఉక్కు స్మృత్యంజలి పార్కులో సోమవారం జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ విశాఖలో ఉక్కు కర్మాగారం వస్తే రాష్ట్ర ప్రజలతో పాటు దేశంలో పలువురికి ఉపాధి లభిస్తుందనే దూర దృష్టితో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారన్నారు. తద్వారా ఉక్కు కర్మాగారం సాధించేందుకు కృషి చేశారని కొనియాడారు. అనంతరం ఉక్కు ఉద్యమంలో అసువులుబాసిన 32 మంది అమరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో అమృతరావు మనువడు గాంధీ, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ వెంకటరామయ్య, కార్మిక నాయకులు డి.ఆదినారాయణ, ఇతర కార్మిక సంఘాల నాయకులు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సంఘాల నాయకులు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

అక్కిరెడ్డిపాలెం (బీహెచ్‌పీవీ), న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ ఇస్మాయిల్ చెప్పారు. ఈ సందర్భంగా వీరిని సోమవారం పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం కాంతం, పాఠశాల సిబ్బంది, తోటి విద్యార్థులు అభినందించారు. ఈ నెల 19న అనకాపల్లి తుంపాలలో జరిగిన పోటీల్లో బి.హేమలత (10వ తరగతి), ఆర్.దిల్లీశ్వరి (8వ తరగతి) రాణించినట్లు పేర్కొన్నారు. దీంతో ఈనెల 25 నుంచి చిత్తూరు జిల్లా కాణిపాకంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో 18 ఏళ్లలోపు విభాగంలో హేమలత.. ప్రకాశం జిల్లాలో నిర్వహించనున్న 14 ఏళ్లలోపు విభాగంలో దిల్లీశ్వరి పాల్గొంటారని వెల్లడించారు.



విద్యార్థులతో హెచ్‌ఎం కాంతం, పీఈటీ ఇస్మాయిల్